



లక్ష మంది హాజరయ్యేలా చర్యలు

- జనసమీకరణ బాధ్యత కూటమి పార్టీల నేతలదే
- ఏయూ ఇంజనీరింగ్ కళాశాల మైదానంలో ముమ్మర ఏర్పాట్లు

22 మండలాలకు ఒక్కరే!

నర్సీపట్నం తూనికలు, కొలతల శాఖ పరిధిలో రెండు జిల్లాలు

- అనకాపల్లి, అల్లూరి జిల్లాల్లో 22 మండలాలు
- మొత్తం మూడు పోస్టులు
- ప్రస్తుతం ఉన్నది ఇన్‌స్పెక్టర్, టెక్నికల్ అసిస్టెంట్ మాత్రమే
- పరిధి అధికంగా ఉండడంతో అంతంతమాత్రంగానే తనిఖీలు
- తూనికలు, కొలతలు, ధరల్లో మోసపోతున్న వినియోగదారులు



ముంచంగిపుట్టులో పాల ఉత్పత్తులు విక్రయించే దుకాణంలో తనిఖీలు నిర్వహిస్తున్న తూనికలు, కొలతల శాఖ ఇన్‌స్పెక్టర్ అనురాధ (ఫైల్ ఫొటో)

నర్సీపట్నం, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): **తూనికలు, కొలతల శాఖ ప్రభుత్వాల నిర్లక్ష్యానికి గురవుతున్నది. వినియోగదారులకు సంబంధించి ఎంతో ముఖ్యమైన ఈ శాఖను అధికారులు, సిబ్బంది కొరత వేధిస్తున్నది. నర్సీపట్నంలోని తూనికలు, కొలత శాఖ డివిజన్ కార్యాలయం పరిధిలో అనకాపల్లి జిల్లాలో 11 మండలాలు, అల్లూరి సీతారామరాజు జిల్లాలో మరో 1 మండలాలు.. మొత్తం 22 మండలాలు వున్నాయి. ఇక్కడి కార్యాలయంలో ఇన్‌స్పెక్టర్, టెక్నికల్ అసిస్టెంట్, ఆఫీసు సబార్డినేట్ ఉండాలి. ఇన్‌స్పెక్టరు, టెక్నికల్ అసిస్టెంట్ మాత్రమే వున్నారు. ఆఫీసు సబార్డినేట్ పోస్టు ఖాళీ ఉంది. ఇటు కార్యాలయంలో పనులు చేసుకుంటూ, అటు క్షేత్రస్థాయిలో తనిఖీలకు ఈ ఇద్దరే వెళ్లాల్సి వస్తున్నది. పరిధి విస్తారంగా వుండడంతో తనిఖీలు అరకొరగానే సాగుతున్నాయి.**

వినియోగదారులకు సంబంధించి ప్యాకింగ్ చేసిన ఏ వస్తువు అయినా సరే గరిష్ఠ చిల్లర ధర (ఎమ్మార్పీ)కు మించి అమ్మకూడదు. ప్యాకింగ్‌పై ముద్రించిన మేరకు బరువు వుండాలి. అదే విధంగా తూనిక రాళ్లు, కాటాలు, కొలతల పరికరాలు కచ్చితమైన ప్రమాణాలతో వుండాలి.



నర్సీపట్నంలో తూనికలు, కొలతల శాఖ కార్యాలయం

వీటికి సంబంధించి కొంతమంది వ్యాపారులు అక్రమాలకు పాల్పడుతుంటారు. ఎమ్మార్పీ కంటే ఎక్కువ ధరకు విక్రయించడం, తూనిక రాళ్లను అరగదీయడం, ఎలక్ట్రానిక్ కాటాలను ట్యాంపరింగ్ చేయడం, కొలతల పరికరాల ఎత్తు/లోతు తగ్గించడం వంటివి జరుగుతుంటాయి. ఇటువంటి వాటిని సామాన్య వినియోగదారులు పసిగట్టలేరు. ఇంకా రైల్వే స్టేషన్లు, సినిమా హాళ్లు, బస్టాండుల్లోని దుకాణాల్లో తినుబండారాలు, శీతల పానీయాలు, మినరల్ వాటర్ బాటిళ్లను ఎమ్మార్పీ కన్నా ఎక్కువ రేటుకు అమ్మడం లేదా సొంతంగా ఎక్కువ రేటు ముద్రించి అమ్మడం చేస్తుంటారు. ఇటువంటి అక్రమాలు, మోసాలను అరికట్టడానికి తూనికలు, కొలతల శాఖ అధికారులు దుకాణాల్లో ఆకస్మిక తనిఖీలు చేపట్టి అక్రమాలకు అడ్డుకట్ట వేయాలి. తప్పుడు పనులకు పాల్పడిన వ్యాపారులకు జరిమానాలు విధించే అధికారం వుంది. అయితే ... మిగతా 6వ పేజీలో

ప్రధాని సభకు భారీ ఏర్పాట్లు

- 29న సాయంత్రం టైకూన్ జంక్షన్ నుంచి ఎస్పీ బంగ్లా వరకు రోడ్‌షో?
- పూడిమడక ఎన్‌టీపీసీ గ్రీన్ హైడ్రోజన్ ప్లాంట్‌కు వేదిక వద్ద శంకుస్థాపన
- పలు జాతీయ రహదారులు, రైల్వే ప్రాజెక్టులను జాతికి అంకితం చేయనున్న ప్రధాని
- విశాఖ రైల్వేజోన్‌కు శంకుస్థాపన, ఉక్కు పరిశ్రమకు ప్యాకేజీ ప్రకటించాలని నేతల వినతి



ప్రధాని మోదీ సభకు సిద్ధమవుతున్న ఏయూ ఇంజనీరింగ్ కళాశాల మైదానం

విశాఖపట్నం, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): **ప్రధాని నరేంద్రమోదీ ఈనెల 29వ తేదీన విశాఖపట్నం రానున్నారు. ఈ సందర్భంగా ఆంధ్ర విశ్వవిద్యాలయం ఇంజనీరింగ్ కళాశాల మైదానంలో భారీ బహిరంగ సభ నిర్వహించనున్నారు. సుమారు లక్ష మందిని సభకు సమీకరించేలా ఏర్పాట్లు చేస్తున్నారు. జన సమీకరణ బాధ్యతను ప్రభుత్వం స్థానిక ప్రజాప్రతినిధులు, కూటమి పార్టీల నాయకులకు అప్పగించింది. ఈ సందర్భంగా వేదిక వద్ద ప్రధానమంత్రి పలు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేయనున్నారు.**

అనకాపల్లి జిల్లా అచ్యుతాపురం మండలం పూడిమడక వద్ద ఎన్‌టీపీసీ ఏర్పాటుచేసే గ్రీన్ హైడ్రోజన్ పవర్ ప్లాంట్‌కు ప్రధానమంత్రి శంకుస్థాపన చేస్తారు. నిర్మాణాలు పూర్తిచేసుకున్న దక్షిణ, తూర్పుభారతానికి చెందిన పలు జాతీయ రహదారులు, రైల్వే ప్రాజెక్టులను ప్రధాని ఈ వేదిక నుంచే జాతికి అంకితం చేస్తారు. కాగా ఇదే పర్యటనలో విశాఖ కేంద్రంగా ఏర్పాటుకానున్న రైల్వేజోన్‌కు శంకుస్థాపన చేసే కార్యక్రమంలో పొందుపరచాలని స్థానిక నేతలు రాష్ట్ర ప్రభుత్వం ద్వారా ప్రధాని కార్యాలయాన్ని కోరేందుకు నిర్ణయించారు. రైల్వేజోన్ నిర్మాణాలకు టెండర్లు ఆహ్వానించిన నేపథ్యంలో స్థానిక నేతలు ఈ విషయాన్ని తెరపైకి తీసుకువచ్చారు. దీంతో పాటు విశాఖ ఉక్కు కర్మాగారం పునరుజ్జీవం కోసం ప్రత్యేక ప్యాకేజీని ప్రకటించాలని కూడా కోరుతున్నారు.

ఏర్పాట్లపై కలెక్టర్ సమావేశం

ఇదిలావుండగా ప్రధానమంత్రి పర్యటన ఏర్పాట్లపై ఆదివారం కలెక్టరేట్‌లో అధికారులు, ప్రజాప్రతినిధులతో కలెక్టర్ ఎంఎన్.హరేంధిరప్రసాద్ సమావేశం నిర్వహించారు. ప్రధానమంత్రి పర్యటనలో రాష్ట్ర గవర్నర్, ముఖ్యమంత్రి పాల్గొంటారని, వారికి బస ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. ఈనెల 29వ తేదీ సాయంత్రం ప్రధాని ఐఎన్ఎస్ డేగాకు చేరుకుని, అక్కడి నుంచి రోడ్డు మార్గం లేదా హెలికాప్టర్‌లో ఏయూకు చేరుకునే అవకాశం ఉందని కలెక్టర్ తెలిపారు. పలు ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు చేసిన అనంతరం ప్రజలనుద్దేశించి ప్రసంగిస్తారన్నారు. రోడ్డు మార్గంలో వస్తే టైకూన్ జంక్షన్ నుంచి ఎస్పీ బంగ్లా వరకు రోడ్‌షో ఉంటుందన్నారు. ప్రధాని పర్యటనకు సంబంధించిన పూర్తివివరాలు రావాల్సి ఉందన్నారు. ఈ సమావేశంలో విశాఖ ఎంపీ ఎం.శ్రీభరత్, ప్రభుత్వ విప్ పి.గణబాబు, ఎమ్మెల్యేలు పల్లా శ్రీనివాసరావు, పి.విష్ణుకుమార్‌రాజు, పంచకర్ల రమేశ్‌బాబు, నగర సీపీ శంఖబ్రాత బాగ్చీ, డీసీపీ అజిత వేజెండ్ల, మేరీ ప్రశాంతి, జీవీఎంసీ కమిషనర్ సంపత్‌కుమార్, జేసీ మయూర్ అశోక్, డీఆర్వో బీహెచ్ భవానిశంకర్, ఆర్డీవోలు శ్రీలేఖ, సంగీత్‌మాధుర్ పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

ప్రధాని పర్యటన సాగేదిలా...

ప్రాథమిక సమాచారం ప్రకారం ప్రధాని ఈనెల 29వ తేదీన సాయంత్రం విమానాశ్రయానికి చేరుకుంటారు. ఓపెన్ టాప్ వాహనంలో ఎయిర్‌పోర్టు నుంచి కాన్వెంట్ జంక్షన్, ఫ్లైవోవర్ మీదుగా టైకూన్ జంక్షన్ వరకు రోడ్డుమార్గాన చేరుకున్న ప్రధాని అక్కడి నుంచి ఎస్పీ బంగ్లా వరకు సుమారు అరకిలోమీటరు పొడవునా రోడ్‌షోలో పాల్గొంటారు. అక్కడి నుంచి వేదిక వద్దకు చేరుకుంటారు. వేదికపై 4.45 గంటల నుంచి సాయంత్రం ఐదుగంటల వరకు గవర్నర్, ముఖ్యమంత్రి, ఇతర మంత్రుల సమక్షంలో ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు చేస్తారు. సీఎం చంద్రబాబునాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ప్రసంగాల తరువాత సాయంత్రం 5.25 గంటల నుంచి 5.43 గంటల వరకు ప్రధాని నరేంద్రమోదీ ప్రజలనుద్దేశించి ప్రసంగిస్తారు. అనంతరం 5.45 గంటలకు సభావేదిక నుంచి ఎయిర్‌పోర్టుకు తిరుగుపయనమవుతారు.

ప్రధాని సభకు వాన గండం?

విశాఖపట్నం, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఈనెల 29న విశాఖలో జరిగే కార్యక్రమంలో పాల్గొంటారు. అయితే బంగాళాఖాతంలో ప్రస్తుతం ఉన్న తీవ్ర అల్పపీడనం బలపడి ఉత్తర తమిళనాడు, కోస్తాంధ్ర వైపుగా వచ్చే అవకాశం ఉండడంతో ఈనెల 27వ తేదీ నుంచి కోస్తాలోని పలు జిల్లాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరించింది. ఈనెల 28 నుంచి 30వ తేదీ వరకు అనకాపల్లి, కాకినాడ, విశాఖపట్నం, విజయనగరం జిల్లాల్లో వర్షాలు కురుస్తాయని విశాఖ తుపాన్ హెచ్చరిక కేంద్రం ఆదివారం ప్రకటించింది. దీంతో ఈ నెల 29న ప్రధాని సభకు వానగండం ఉండే అవకాశం ఉందని వాతావరణ నిపుణుడొకరు తెలిపారు. దీనివల్ల సభకు అంతరాయం ఏర్పడే అవకాశం ఉందన్నారు. దీనిపై ఈనెల 26వ తేదీ నాటికి మరింత స్పష్టత వస్తుందన్నారు.

రేపు ఐదుగురు మంత్రుల సమీక్ష

ప్రధానమంత్రి పర్యటన విజయవంతం చేయడానికి ఈనెల 26వ తేదీన విశాఖపట్నం కలెక్టరేట్‌లో ఐదుగురు రాష్ట్ర మంత్రులు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సమీక్ష నిర్వహిస్తారు. ప్రధాని పర్యటనకు సంబంధించి తీసుకోనున్న చర్యలు, చేపట్టనున్న ఏర్పాట్లపై వీరు సమీక్షించనున్నారు.

ప్రభుత్వ భూములకు రెక్కలు

వెదుళ్లనరవలో రూ.కోట్లు విలువైన స్థలాలు కబ్జా

- ప్రజల ఫిర్యాదులతో 'రెవెన్యూ' హెచ్చరిక బోర్డులు
- తెల్లవారేసరికి బోర్డులు మాయం చేస్తున్న ఆక్రమణదారులు
- స్థలాల చుట్టూ ప్రహరీ గోడల నిర్మాణం
- మరికొన్నిచోట్ల జిరాయితీతో కలిపి.. ప్లాట్లుగా విక్రయం



వెదుళ్లనరవ సర్వే నంబరు 102లో ఆక్రమించి చదును చేసిన గెడ్డవాగు ప్రభుత్వ భూమి

సబ్బవరం, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): **మండలంలోని వెదుళ్లనరవలో విలువైన ప్రభుత్వ భూములను కాపాడేందుకు రెవెన్యూ అధికారులు ఎన్ని చర్యలు చేపట్టినప్పటికీ కబ్జాదారులు బేఖాతరు చేస్తున్నారు. కొంతమంది స్థానిక నాయకులు ఖాళీగా వున్న ప్రభుత్వ స్థలాలు, భూములను కబ్జా చేయడం పరిపాటిగా మారింది. ఆక్రమణకు గురైన ప్రభుత్వ భూములను రెవెన్యూ అధికారులు స్వాధీనం చేసుకుని ఏర్పాటు చేస్తున్న హెచ్చరిక బోర్డులను సైతం పీకిపారేస్తున్నారు. వెదుళ్లనరవ జీవీఎంసీ పరిధిలో ఉండడం, పారిశ్రామిక ప్రాంతం దువ్వాడకు అనుకొని ఉండడంతో ఇక్కడ భూముల విలువ విపరీతంగా పెరిగిపోయింది. గజం రూ.20 వేల నుంచి రూ.25 వేల వరకు ఉంది.**

వెదుళ్లనరవ సర్వే నంబరు 118లో 2.4 ఎకరాల ప్రభుత్వ భూమి ఉంది. ఇప్పటికే సుమారు 1.5 ఎకరాల భూమి అన్యాక్రాంతంకాగా సుమారు 80 సెంట్లు మిగిలి ఉంది. గతంలో రెవెన్యూ అధికారులు సర్వే చేసి హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేశారు. అయితే ఈ భూమిని కొంతమంది ఆక్రమించుకొని విక్రయించే ప్రయత్నాలు చేస్తున్నారు. రెవెన్యూ అధికారులు ఏర్పాటు చేసిన హెచ్చరిక బోర్డులను పీకేశారు. భూమి చుట్టూ ఇటుకలు, కాంక్రీటు పలకలతో ప్రహరీ గోడ నిర్మించారు.



సర్వే నంబరు 118లో ప్రభుత్వ భూమి చుట్టూ నిర్మించిన ప్రహరీ గోడ

వెదుళ్లనరవ సర్వే నంబరు 102లో 3.87 ఎకరాలు గెడ్డ/వాగు పోరంబోకు భూమి, సర్వే నంబరు 101లో 96 సెంట్ల ప్రభుత్వ భూమి(గయాళు) ఉంది. వీటి పక్కనే వున్న జిరాయితీ భూములను ఓ వ్యక్తి కొనుగోలు చేసి, గెడ్డవాగు భూమి, గయాళు భూమి ఆక్రమించాడు. అనంతరం లే-అవుట్ వేసి ప్లాట్లుగా అమేశాడు. ఈ భూముల్లో కొంత మంది ఇళ్ల నిర్మాణాలు చేపట్టగా, సర్వే నంబరు 101లో కొంత భూమి ఖాళీగా ఉంది. దీనిని గతంలో రెవెన్యూ అధికారులు స్వాధీనం చేసుకొని హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేశారు. ఇదిలావుండగా కొంత మంది చోటా నేతలు సర్వే నంబరు 102లో ఖాళీగా ఉన్న సుమారు 1,000 గజాల స్థలాన్ని అమ్మకానికి ప్రయత్నాలు చేస్తున్నట్టు చెబుతున్నారు.

గెడ్డవాగును ఆక్రమించి లే-అవుట్

వెదుళ్లనరవ సర్వే నంబరు 77/2లో 1.08 ఎకరాల గెడ్డవాగు పోరంబోకు భూమి ఉంది. ఓ వ్యక్తి దీనికి ఆనుకొని రెండు ఎకరాల జిరాయితీ భూమిని కొనుగోలు చేశాడు. అనంతరం గెడ్డవాగును ఆక్రమించి లే-అవుట్ వేసి విక్రయిస్తున్నాడు. దీనిపై ఫిర్యాదులు అందడంతో రెవెన్యూ అధికారులు హెచ్చరిక బోర్డులు పెట్టడం.. ఆక్రమణదారులు తొలగించడం పరిపాటిగా మారింది. మరోవైపు లే-అవుట్‌కు వీఎంఆర్‌డీఏ అనుమతులు లేవని అధికారులు ప్రకటన జారీ చేయడం ఈ సందర్భంగా గమనార్హం.

విద్యా వ్యవస్థను ప్రయోగశాల చేయొద్దు

యూటీఎఫ్ జిల్లా ప్రధానకార్యదర్శి చినబ్బాయి



సమావేశంలో మాట్లాడుతున్న చినబ్బాయి

అనకాపల్లి టౌన్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం విద్యా వ్యవస్థను ప్రయోగశాలగా మారుస్తున్నదని, ఇటువంటి చర్యలను విరమించుకోవాలని యూటీఎఫ్ జిల్లా ప్రధానకార్యదర్శి గొంది చినబ్బాయి పేర్కొన్నారు. ఐక్య ఉపాధ్యాయ సమాఖ్య జిల్లా స్వర్ణోత్సవ సభ ఆదివారం ఇక్కడ జిల్లా అధ్యక్షురాలు వత్సవాయి శ్రీలక్ష్మి అధ్యక్షతన ... మిగతా 6వ పేజీలో

ఏటికొప్పాకలో ఓపెన్‌బార్

అమ్మవారి జాతర సందర్భంగా బహిరంగంగానే మద్యం విక్రయాలు

- దుకాణాల వెనుక మందుబాబుల కోసం టెంట్ వేసి ఏర్పాట్లు చేసిన వ్యాపారులు



ఏటికొప్పాకలో మద్యం దుకాణాల వెనుక బార్‌ను తలపిస్తున్న బహిరంగ మద్యపానం

ఎలమంచిలి, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): మద్యం అమ్మకాల విషయంలో ప్రభుత్వ నిబంధనలను వ్యాపారులు బేఖాతరు చేస్తున్నారు. లైసెన్సుడ్ షాపుల్లో మాత్రమే మద్యం అమ్మాలని, బెల్టు దుకాణాలు వుండకూడదని, బహిరంగంగా మద్యం సేవించడానికి అనుమతించవద్దన్న నిబంధనలకు తూట్లు పొడుస్తున్నారు. మేజర్ పంచాయతీ ఏటికొప్పాకలో బండిమాంబ జాతర సందర్భంగా స్థానిక మద్యం దుకాణాల నిర్వాహకులు ఓపెన్ బార్లను నిర్వహించారు.

ఏటికొప్పాకలో రెండు మద్యం దుకాణాలు వున్నాయి. ఇక్కడ నాలుగు రోజుల నుంచి బండిమాంబ ఉత్సవాలు జరుగుతున్నాయి. చివరి రోజైన ఆదివారం వేలాది మంది హాజరయ్యారు. దీంతో మద్యం దుకాణాల నిర్వాహకులు తమ వ్యాపారాన్ని పెంచుకునేందుకు షాపుల వెనుక ఖాళీ స్థలాల్లో టెంట్‌లు వేశారు. దుకాణాల్లో మద్యం కొనుగోలు చేసిన వారు ఇక్కడకు వచ్చి కూర్చుని తాపీగా తాగేందుకు కుర్చీలు, టేబుళ్లు ఏర్పాటు చేశారు. ప్రధాన రహదారికి ఆనుకుని, పట్టపగలు బహిరంగంగా మద్యం సేవిస్తున్నప్పటికీ పోలీసు, ఎక్సైజ్ అధికారులు పట్టించుకోలేదు.

జనసేన పార్టీలో చేరికలు



జనసేనలో చేరిన వారితో విజయకుమార్, సతీష్‌కుమార్

ఎలమంచిలి, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పద్మనాభరాజుపేట, బయ్యవరం గ్రామాలకు చెందిన వైసీపీ నేతలు, కార్యకర్తలు ఆదివారం ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్, సతీష్‌కుమార్ సమక్షంలో జనసేన పార్టీలో చేరారు. స్థానిక జనసేన పార్టీ కార్యాలయంలో ఎంపీటీసీ మాజీ సభ్యుడు బంధం రామకృష్ణ, పాల సొసైటీ మాజీ అధ్యక్షుడు కె.జోగారావు, వార్డు మెంబరు ఎం. అప్పలనాయుడు, సచివాలయ కన్వీనర్ చంద్రగిరి నాని, పాలసొసైటీ డైరెక్టర్లు జెర్రిపోతుల రమణ, మొగిలి నరసయ్య, నేతలు నక్కన అయ్యప్పస్వామి, మరో 50 మందికి ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ రాజాన శేషు, జనసేన మండల అధ్యక్షుడు అన్నం బాబ్జీ, జనసేన నేతలు శానా నానాజీ, కె. భాస్కరరావు, బొద్దపు శ్రీను, లవుడు లోవరాజు పాల్గొన్నారు.

రేవుపోలవరం తీరంలో పర్యాటకుల సందడి



పర్యాటకులతో కిటకిటలాడుతున్న రేవుపోలవరం తీరం

ఎస్.రాయవరం, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రేవుపోలవరం సముద్ర తీరం ఆదివారం పర్యాటకులతో కిటకిటలాడింది. కార్తీకమాసం పురస్కరించుకొని పిక్నిక్‌ల కోసం అధికసంఖ్యలో సందర్శకులు తరలివచ్చారు. సముద్రంలో జలకాలు ఆడుతూ సరదాగా గడిపారు. మధ్యాహ్నం అందరూ కలిసి భోజనాలు చేశారు. ప్రమాదాలు జరగకుండా పెంటకోట మెరైన్ పోలీసులు గస్తీ నిర్వహించారు.

సీఐటీయూ బైక్ ర్యాలీ



బైక్ ర్యాలీ నిర్వహిస్తున్న సీఐటీయూ నాయకులు

అచ్యుతాపురం రూరల్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): అనకాపల్లి నెహ్రూచౌక్‌లో ఈనెల 26న జరిగే మహాధర్నాను విజయవంతం చేయాలని కోరుతూ ఆదివారం సీఐటీయూ మండల కేంద్రంలో బైక్ ర్యాలీ నిర్వహించింది. అచ్యుతాపురం జంక్షన్ నుంచి రామన్నపాలెం సంత, వెదురువాడ, తహసీల్దార్ ఆఫీస్‌ల మీదుగా బైక్ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు రొంగలి రాము, రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు కర్రి అప్పారావు, మండల కన్వీనర్ కూండ్రపు సోమునాయుడు, జిల్లా కమిటీ సభ్యులు రాజన్న, సత్తిబాబు, తదితరులు పాల్గొన్నారు.

అనంతపద్మనాభస్వామి ఆలయంలో పూజలు



స్వామి వారిని దర్శించుకుంటున్న పెదిరెడ్డి చిట్టిబాబు, తదితరులు

పాయకరావుపేట రూరల్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పీఎల్.పురం సమీపంలో లోవ కొండపై అనంత పద్మనాభస్వామి ఆలయంలో కార్తీక మాసం సందర్భంగా ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు కార్తీక మాస వన సమారాధన నిర్వహించారు. టీడీపీ మండల అధ్యక్షుడు పెదిరెడ్డి చిట్టిబాబు అనంతపద్మనాభ స్వామిని దర్శించుకుని, పూజలు నిర్వహించారు. అన్న సమారాధనలో పాల్గొన్నారు. ప్రతీ ఏటా కార్తీక మాసంలో స్వామి వారి ఆలయం వద్ద అన్న సమారాధన నిర్వహిస్తున్నట్టు ఆలయ చైర్మన్ పిల్లి నాగేంద్ర అన్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యుడు నాగం చినబాబు, టీడీపీ నాయకులు చింతకాయల రాంబాబు, నాగం బుల్లిదొర, కురందాసు శివ, ఈగల సూర్యనారాయణ, వేములపూడి అప్పారావు, నాగమల్లు వెంకన్నదొర, మేడిశెట్టి రాజేశ్ పాల్గొన్నారు.

ఇంటర్ ప్రతిభ పరీక్షకు విశేష స్పందన

మునగపాక, నవంబర్ 24 (ఆంధ్రజ్యోతి): స్థానిక జడ్పీ హైస్కూల్‌తోపాటు పలు స్కూళ్లో నిర్వహించిన ఇంటర్మీడియట్ ప్రతిభ పరీక్షకు విశేష స్పందన లభించింది. స్టూడెంట్ టాలెంట్ టెస్ట్ పేరుతో మునగపాకకు చెందిన పెంటకోట పుష్పరాజ్ కొన్నేళ్లుగా పరీక్ష నిర్వహిస్తున్నారు. ఈ ఏడాది ఐదు కేంద్రాల్లో ఈ పరీక్షను నిర్వహించారు. సుమారు 1700 మంది విద్యార్థులు పరీక్షకు హాజరయ్యారు. ప్రతిభ చూపిన 25 మంది విద్యార్థులకు రూ.10వేలు చొప్పున నగదు ప్రోత్సాహన్ని అందజేస్తామని నిర్వాహకులు తెలిపారు.

జీపులో మంటలు

ఎలమంచిలి, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఏటికొప్పాక గ్రామంలో ఆదివారం మధ్యాహ్నం ప్రమాదవశాత్తూ జీపులో మంటలు వ్యాపించడంతో చుట్టు పక్కల జనం పరుగులు తీశారు. ఆదివారం గ్రామ దేవత జాతరకు ఇతర ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో జనం గ్రామానికి వచ్చారు. గ్రామ సమీపంలో పార్కింగ్ స్థలంలో నిలుపుదల చేసిన జీపులో మంటలు వ్యాపించడంతో స్థానికులు గమనించి కొందరు పరుగులు తీశారు. సమాచారం అందుకున్న అగ్నిమాపక అధికారులు వచ్చి మంటలను అదుపుచేసేలోపు నష్టం జరిగిపోయిందని స్థానికులు తెలిపారు.

స్మార్ట్ మీటర్ల ఏర్పాటు నిలుపుదల చేయాలి

కోటవురట్ల, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): స్మార్ట్‌మీటర్ల ఏర్పాటును వెంటనే నిలుపుదల చేయాలని సీపీఎం జిల్లా నాయకుడు ఎం. సత్యనారాయణ, మండల నాయకుడు జి. డేవిడ్‌రాజు డిమాండ్ చేశారు. ఆదివారం కొడవటిపూడిలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ స్మార్ట్‌మీటరు విధానాన్ని వ్యతిరేకించాలన్నారు. కూటమి ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను విస్మరించి ప్రజలపై భారం మోపడానికి ప్రయత్నం చేస్తుందన్నారు. దీనివల్ల ప్రజలు తీవ్ర ఇబ్బందులు గురికావాల్సి వస్తుందన్నారు. ఈ విధానాన్ని నిలుపుదల చేయకుంటే ఉద్యమాన్ని దశల వారీగా ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

తుప్పు పట్టిన వాటర్ పైపులైన్

- తరచూ మరమ్మతులు
- పైపులైన్‌కు రంధ్రాలు ఏర్పడడంతో వృథాగా పోతున్న నీరు
- కలుషిత నీరు సరఫరా అవుతున్నదని పలు గ్రామాల ప్రజలు ఆందోళన



పైపులైన్ నుంచి బయటకు పోతున్న నీరు



పైపులైన్ వద్ద లీకైన నీరు

మునగపాక, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): మండలంలో పలు గ్రామాలకు సరఫరా అవుతున్న తాగునీటి పైపులైన్ తుప్పు పట్టింది. దీంతో నీరు వృథాగా పోతోంది. తొలుత పైపులైన్ నుంచి ధారలా మొదలైన నీరు కొన్ని రోజులకు అధికమవుతోంది. నెల రోజుల క్రితం అరబుపాలెం వెళ్లే రోడ్డు మార్గంలో మిల్లుకు సమీపంలో పైపు లైన్ దెబ్బతినడంతో అధికంగా నీరు బయటకు పోయింది. అది సరిచేయడానికి పక్షం రోజులు పట్టింది. పాత పైపులైన్ తుప్పు పట్టడంతో దానిని తొలగించి కొత్త పైపు వేశారు. దాని నుంచి వాటర్ బయటకు రావడంతో రెండు,మూడు రోజులు తరువాత సరిచేశారు. అంతకుముందు రెండు నెలలుగా మునగపాక బైపాసు రోడ్డు బ్రిడ్జి వద్ద ఉన్న ఇనుప పైపులైన్ కూడా తుప్పు పట్టడంతో నీరు బయటకు పోతోంది. పైపులైన్‌కు పట్టిన తుప్పు తాగునీటిలో కలిసే ప్రమాదం ఉందని పలువురు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గ్రామీణ ప్రజలకు శుద్ధి చేసిన జలాలను అందించాలని పదేళ్ల క్రితం సంపత్‌పురం నుంచి ఇనుప పైప్‌లైన్ వేశారు. ఈ పైప్‌లైన్ ద్వారా మండలంలోని చాలాగ్రామాలకు తాగునీరు సరఫరా అవుతోంది. పైపులైన్ ద్వారా ఉమ్మలాడ, నాగులాపల్లి, గంగాదేవిపేట, మునగపాక, తిమ్మరాజుపేట, వాడ్రాపల్లి, కుంచవానిపాలెం, మళ్లవరం, గొల్లలవానిపాలెం, పాటిపల్లి, మంగళవరపుపేట తదితర గ్రామాలకు తాగునీరు సరఫరా అవుతోంది. చాలా వరకు పైపు లైన్ భూగర్భంలో ఉండగా బ్రిడ్జిలు ఉన్నచోట బయటకు ఉన్న పైపులైన్ దెబ్బతింటున్నది. తుప్పు పట్టిన పైపులైన్‌ను తక్షణమే తొలగించి కొత్తది వేయాలని పలు గ్రామాల ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. ఈ సమస్యపై పైపులైన్ లైన్ సూపర్‌వైజర్ సోమినాయుడు వద్ద ప్రస్తావించగా.. దెబ్బతిన్న చోట పైపులైన్‌కు మరమ్మతులు చేస్తున్నామన్నారు. ఒకచోట వెల్డింగ్ చేసినా మరో చోట లీకేజీలు మొదలవుతున్నాయని, దెబ్బతిన్న పైపులైన్ భాగాన్ని కట్ చేసి కొత్తపైపులైన్ జాయింట్ చేస్తేనే అదుపులోకి వస్తుందన్నారు. త్వరలో పనులు జరగనున్నాయన్నారు.

అంగరంగ వైభవంగా ఏటికొప్పాక బండిమాంబ జాతర

- ప్రత్యేక ఆకర్షణగా నిలిచిన విద్యుత్ సెట్టింగ్‌లు
- వేలాది సంఖ్యలో తరలివచ్చిన భక్త జనం
- అమ్మవారిని దర్శించుకున్న ప్రముఖులు



అమ్మవారిని దర్శించుకుంటున్న ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్



అమ్మవారిని దర్శించుకుంటున్న ఏపీఆర్‌డీసీ చైర్మన్ ప్రగడ నాగేశ్వరరావు



అమ్మవారిని దర్శించుకునేందుకు బారులు తీరిన భక్తులు

ఎలమంచిలి, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఏటికొప్పాక బండిమాంబ అమ్మవారి జాతర ఆదివారం అంగరంగ వైభవంగా జరిగింది. తెల్లవారు నుంచే అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తులు ఆలయం వద్ద బారులు తీరారు. అమ్మవారికి ప్రత్యేక అలంకరణలు, పూజలు నిర్వహించిన తరువాత భక్తులకు దర్శనమిచ్చారు. వేలాది మంది భక్తులు, ప్రముఖులు, ప్రజాప్రతినిధులు అమ్మవారిని దర్శించుకున్నారు. స్థానిక ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్, రాష్ట్ర రోడ్ల అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ ప్రగడ నాగేశ్వరరావు, మాజీ ఎమ్మెల్యే యూవీ రమణమూర్తిరాజు, గవర కార్పొరేషన్ మాజీ చైర్మన్ బొడ్డేడ ప్రసాద్, ఎంపీపీ బోదెపు గోవింద్ వేర్వేరుగా అమ్మవారిని దర్శించుకున్నారు. వీరికి స్థానిక నేతలు కాండ్రకోట చిరంజీవి, బాబ్జీ స్వాగతం పలికారు. అదేవిధంగా జనసేన, టీడీపీ, బీజేపీ నేతలు అమ్మవారిని దర్శించుకున్నారు.

జాతరకు ఏర్పాటు చేసిన విద్యుత్ లైటింగ్, భారీ సెట్టింగ్‌లు భక్తులను ఆకట్టుకున్నాయి. వరాహ నది ఒడ్డున ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన స్థలంలో మందుగుండును గంటన్నరకు పైగా కాల్చారు. జాతరతో ఏటికొప్పాక వీధులన్నీ కిక్కిరిసిపోయాయి. నేలవేషాలు, పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఆకర్షణీయంగా నిలిచాయి. పలుమార్లు ట్రాఫిక్‌కు అంతరాయం తప్పలేదు. సీఐ ధనుంజయరావు పర్యవేక్షణలో 80 మంది పోలీసు సిబ్బంది బందోబస్తు నిర్వహించారు.

సందడిగా కార్తీక వన సమారాధనలు



ఎలమంచిలి: విజేతలకు బహుమతులు అందజేస్తున్న శ్రీనివాసరావు



పాయకరావుపేట: దేవాంగుల్లో వివిధ వర్గాల వారిని సత్కరించిన దృశ్యం

ఎలమంచిలి, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): పట్టణానికి సమీపంలోని తోటలో ఆదివారం పట్టణ కిరాణా మర్చంట్స్ అసోసియేషన్, క్షత్రియుల వన సమారాధనలు ఘనంగా జరుపుకున్నారు. కుటుంబ సభ్యులందరితో రోజంతా ఆనందంగా గడిపారు. మర్చంట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. సంఘ అధ్యక్షుడు లింగంపల్లి శ్రీనివాసరావు, ట్రెజరర్ గోపిశెట్టి మురళి పాల్గొన్నారు.అలాగే క్షత్రియుల వనసమారాధన ఆనందోత్సవాల నడుమ జరుపుకున్నారు.

మునగపాకలో..

మండలంలో కార్తీకమాసం వనసమారాధనలు సందడిగా జరిగాయి. మునగపాక, వాడ్రాపల్లి, టి.సిరసపల్లి తదితర గ్రామాల్లో ఆదివారం కార్తీకమాసం పిక్నిక్‌లు జరిగాయి. వాడ్రాపల్లిలో పాఠశాల, కళాశాల విద్యార్థులు, మునగపాకలో గవర సామాజిక వర్గానికి చెందిన ఆడారి, పీలా తదితర కుటుంబీకుల్లు వనసమారాధనలు జరుపుకున్నారు. స్థానిక బైపాస్ రోడ్డుకు సమీపంలో ఆడారి కుటుంబీకులు ఆత్మీయ వనసమారాధన జరిగింది. కుటుంబంలో పెద్దలకు సన్మానం చేసి, వారి ద్వారా ఆశీర్వాదం పొందారు.

పాయకరావుపేటలో..

కార్తీక వన సమారాధనోత్సవాల్లో భాగంగా ఆదివారం పట్టణంలో దేవాంగుల ఆత్మీయ సమ్మేళనం జరిగింది. స్థానిక వై.జంక్షన్ సమీపంలోని కొబ్బరితోటలో దేవాంగ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో మండలంలోని దేవాంగుల కుటుంబసభ్యులు పాల్గొని ఉదయం నుంచి సాయంత్రం వరకు ఉల్లాసంగా గడిపారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన కార్యక్రమంలో వార్డు సభ్యులు, టీడీపీ నాయకులు మలిపెద్ది వెంకటరమణ మాట్లాడుతూ రాష్ట్ర హోం మంత్రి వంగలపూడి అనిత నేతృత్వంలో చేనేత కార్మికుల సంక్షేమం, ఆర్థికాభివృద్ధికి కృషిచేయడం జరుగుతుందని తెలిపారు. అనంతరం వివిధ రంగాల్లో రాణించినవారితోపాటు సీనియర్లను ఘనంగా సత్కరించి జ్ఞాపికలు అందజేశారు. కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు కొమ్మన వెంకటేశ్వరరావు, ఉపాధ్యక్షుడు మలిపెద్ది వెంకటరమణ, కమిటీ సభ్యులు బూడిద గౌరీ శంకర్, యర్రా నరేష్, కర్రా శ్రీను, బళ్ల దొంగబాబు, దాసరి శ్రీను, మలిపెద్ది వరహాలు, రొబ్బి సుబ్రహ్మణ్యం, కాలెపు వీరభద్రరావు, కొమ్మన సత్యనారాయణ, గోరు భద్రం పాల్గొన్నారు.

ప్రమాదకరంగా పాత భవనాలు

- పెద్దూరులో కూలడానికి సిద్ధంగా పాత తుఫాన్ రక్షిత భవనం, బీసీ హాస్టల్ భవనం
- అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారిన వైనం
- పక్కనే ప్రాథమిక పాఠశాల నిర్వహణ
- భవనాలను తొలగించాలని స్థానికుల డిమాండ్



మూసివేసిన పాత హాస్టల్ భవనం

అచ్యుతాపురం రూరల్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పూడిమడక శివారు పెద్దూరులో రెండు పురాతన ప్రభుత్వ భవనాలు ప్రమాదకరంగా మారాయి.



శిథిలావస్థలో ఉన్న తుఫాన్ రక్షిత భవనం

గ్రామానికి ఆనుకుని ఉన్న తుఫాన్ రక్షిత భవనం, బీసీ హాస్టల్ భవనాలు భయానకంగా ఉన్నాయి. దశాబ్దాల క్రితం ఇక్కడ నిర్మించిన ఈ రెండు భవనాలు శిథిలావస్థకు చేరుకోవడంతో అసాంఘిక కార్యకలాపాలకు నిలయంగా మారింది. గ్రామంలో మరో తుఫాన్ రక్షిత భవనం నూతనంగా నిర్మించారు. బీసీ సంక్షేమ వసతి గృహాన్ని అచ్యుతాపురం మండల కేంద్రానికి తరలించారు. ఈ భవనం మందుబాబులకు అడ్డాగా మారింది. శ్లాబ్‌లు పూర్తిగా పాడైపోగా, గోడలు రేపో మాపో కూలిపోవడానికి సిద్ధంగా ఉన్నాయి. ఇక్కడ నుంచే లైట్‌హౌస్‌కు వెళ్లే రహదారి ఉంది. నిత్యం రద్దీగా ఉండే ఈ ప్రాంతంలో హాస్టల్ ఎదురుగా, తుఫాన్ భవనానికి పక్కనే ప్రాథమిక పాఠశాల కూడా ఉంది. పగటి పూట ఈ విద్యార్థులు కాలకృత్యాలకు, ఆటలాడుకోడానికి నిత్యం వెళ్తూ ఉంటారు. జనాలు ఉండే సమయంలో ప్రమాదం వాటిల్లితే ప్రాణనష్టం జరిగే ప్రమాదం ఉంది. అధికారులు వెంటనే స్పందించి శిథిలావస్థలో ఉన్న ఈ రెండు భవనాలను వెంటనే తొలగించి, ఈ ప్రదేశాన్ని వేరొక ప్రభుత్వ అవసరాలకు వినియోగించాలని స్థానికులు కోరుతున్నారు.

22 మండలాలకు ఒక్కరే!

... 5వ పేజీ తరువాయి

తూనికలు, కొలత శాఖలో ఒక ఇన్‌స్పెక్టర్, టెక్నికల్ అసిస్టెంట్ మాత్రమే వుండడంతో తనిఖీలు నామమాత్రంగానే సాగుతున్నాయి. ఒకవేళ దాడులకు వెళ్లి ఒక దుకాణంలో తనిఖీలు నిర్వహిస్తుంటే. క్షణాల్లో మిగిలిన వ్యాపారులు దుకాణాలను మూసేసి జారుకుంటున్నారు.

22 మండలాలకు ఒకే ఒక్క ఇన్‌స్పెక్టర్

నర్సీపట్నం తూనికలు, కొలతల శాఖ కార్యాలయం పరిధిలో నర్సీపట్నం, నాతవరం, గొలుగొండ, మాకవరపాలెం, పాయకరావుపేట, కోటవురట్ల, నక్కపల్లి, ఎస్.రాయవరం, ఎలమంచిలి, రాంబిల్లి, అచ్యుతాపురం మండలాలు, అల్లూరి సీతారామరాజు జిల్లాలో పాడేరు, జి.మాడుగుల, చింతపల్లి, జీకే వీధి, కొయ్యూరు, అరకులోయ, అనంతగిరి, డుంబ్రిగుడ, హుకుంపేట, పెదబయలు, ముంచంగిపుట్టు మండలాలు వున్నాయి. నర్సీపట్నం కార్యాలయంలో మూడు పోస్టులు.. ఇన్‌స్పెక్టర్, టెక్నికల్ అసిస్టెంట్, ఆఫీసు సబార్డినేట్ మాత్రమే వున్నాయి. ప్రస్తుతం ఆఫీసు సబార్డినేట్ పోస్టు ఖాళీగా వుంది.

ఎక్కువ పరిధితో ఇబ్బందులు

నర్సీపట్నం కార్యాలయం పరిధిలో అనకాపల్లి జిల్లాలో 4,500, అల్లూరి సీతారామరాజు జిల్లాలో 1,300 దుకాణాలు ఉన్నాయి. నర్సీపట్నం నుంచి సీలేరు, ముంచంగిపుట్టు, అరకులోయ వంటి ప్రాంతాలు చాలా దూరంలో వున్నాయి. ఈ ప్రాంతాల్లో తనిఖీలకు వెళ్లి సాయంత్రానికి తిరిగి నర్సీపట్నం చేరుకునేసరికి ఏ అర్ధరాత్రో అవుతుంది. మహిళా అధికారి కావడంతో దూరప్రాంతాల్లో తనిఖీలకు వెళ్లిరావడం ఇబ్బందికరమే! అయినప్పటికీ గత ఆర్థిక సంవత్సరం (2023-24)లో 173 కేసులు, ఈ ఏడాది ఇప్పటి వరకు 160 కేసులు నమోదు చేశారు. ముంచగిపుట్టులో పాల ఉత్పత్తులను అధిక ధరలకు విక్రయిస్తున్నారని ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ఫిర్యాదు రావడంతో లీగల్ మెట్రాలజీ ఇన్‌స్పెక్టర్ అనురాధ ఈ ఏడాది ఆగస్టు 26వ తేదీన అక్కడకు వెళ్లి తనిఖీలు నిర్వహించారు. ఐదుగురు వ్యాపారులపై కేసులు నమోదు చేశారు.

విద్యా వ్యవస్థను ప్రయోగశాల చేయొద్దు

... 5వ పేజీ తరువాయి

జరిగింది. ఈ సందర్భంగా చినబ్బాయి మాట్లాడుతూ, సిలబస్‌ను ఇష్టం వచ్చినట్టుగా మారుస్తూ విద్యార్థులను, ఉపాధ్యాయులను ఇబ్బందులకు గురి చేస్తున్నదన్నారు. 117 జీవో వల్ల ప్రభుత్వ పాఠశాలలు నిర్వీర్యమవుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక 117 జీవోను రద్దు చేస్తామని హామీ ఇచ్చి ఇంతవరకు అమలు చేయలేదన్నారు. జీవో నంబరు-3ని సర్వోన్నత న్యాయస్థానం రద్దు చేయడం వల్ల మైదాన ప్రాంత ఉపాధ్యాయులు ఏజెన్సీకి బదిలీపై వెళ్లి ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. ఈ సమావేశంలో రాష్ట్ర కార్యదర్శి అన్నా రాము, సమాఖ్య నేతలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మల్లప్ప చెరువులో కలువల సోయగం



మల్లప్ప చెరువులో పూసిన రెండు రకాల కలువ పూలు

రాంబిల్లి, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వెల్చూరు సమీపంలోని మల్లప్ప చెరువులో విరబూసిన కలువ పూలు పలువురిని ఆకట్టుకుంటున్నాయి. ప్రతిఏటా నవంబరులో ఈ చెరువలో రెండు రకాల కలువపూలు విస్తారంగా పూస్తాయి. మహిళలు ఈ చెరువులోని కలువ పూలు సేకరించి పూజా కార్యక్రమాలకు ఉపయోగిస్తున్నారు. ప్రకృతి ప్రేమికులు ఈ చెరువు వద్ద ఆగి ఫొటోలు తీసుకుంటున్నారు.

ముమ్మరంగా టీడీపీ సభ్యత్వ నమోదు



జి.జగన్నాథపురంలో టీడీపీ సభ్యత్వ నమోదు చేయిస్తున్న కొప్పిశెట్టి వెంకటేశ్

నక్కపల్లి, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): మండలంలో టీడీపీ సభ్యత్వాల నమోదు ముమ్మరంగా సాగుతోందని టీడీపీ మండల అధ్యక్షుడు కొప్పిశెట్టి వెంకటేశ్ అన్నారు. మండలంలో జి. జగన్నాథపురం, నక్కపల్లి గ్రామాల్లో ఆదివారం టీడీపీ సభ్యత్వాల నమోదును ఆయన పరిశీలించారు. పార్టీ నాయకులకు పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు వైబోయిన రమణ, నానేపల్లి రాఘవులు, మారిశెట్టి నానాజీ, అప్పలరాజు, అడ్డూరి లోవరాజు, దేవవరపు లోవరాజు, కొప్పిశెట్టి వీరబాబు, అల్లాడ తాతారావు, నాగేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

డిసెంబరు 1న ఎన్‌ఎంఎంఎస్ నమూనా పరీక్ష

మునగపాక, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): స్పందించే హృదయం చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో డిసెంబరు 1వ తేదీన జాతీయ ఉపకార వేతనం (ఎన్ఎంఎంఎస్) నమూనా పరీక్ష జరగనుందని ఆ సంస్థ ప్రతినిధులు ఎస్.తమ్మిరాజు, కేవీ.రమణ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. సంస్థ ఆధ్వర్యంలో 15 సంవత్సరాలుగా విద్యార్థులకు ఎన్ఎంఎంఎస్ అర్హత పరీక్షకు ఉచితంగా శిక్షణ ఇస్తున్నామన్నారు. డిసెంబరు ఒకటో తేదీన మునగపాక, కశింకోట జడ్పీ హైస్కూల్‌ల్లో రెండు బ్యాచ్‌లు ఈ పరీక్ష నిర్వహణ ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. ఉదయం 8 గంటలకు మొదటి బ్యాచ్, 9 గంటలకు రెండో బ్యాచ్‌గా పరీక్ష నిర్వహిస్తున్నామన్నారు. మునగపాకలో పరీక్ష కన్వీనర్ సత్యనారాయణమూర్తి ఏర్పాట్లు చేస్తున్నారన్నారు.

నేడు వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయ వార్షికోత్సవం

రాంబిల్లి, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని అప్పారాయుడుపాలెంలో కొలువై ఉన్న పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయ వార్షికోత్సవం ఈనెల 25వ తేదీన ఘనంగా నిర్వహించనున్నారు. ఇందుకోసం నిర్వాహకులు అన్ని ఏర్పాట్లు చేశారు. ఉదయం 6 గంటలు నుంచి స్వామి వారికి సహస్ర నామాలతో కుంకుమార్చనలు, అభిషేకాలు, దూపదీప నైవేద్యాలతో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించనున్నారు. మధ్యాహ్నం ఆలయ ప్రాంగణంలో విశ్వబ్రాహ్మణ యూత్ ఆధ్వర్యంలో అన్నసమారాధన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్టు నిర్వాహకులు తెలిపారు.

ఘనంగా చింతకాయల విజయ్ జన్మదిన వేడుకలు

నక్కపల్లి, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): టీడీపీ రాష్ట్ర కార్యదర్శి చింతకాయల విజయ్ జన్మదిన వేడుకలను ఆదివారం నక్కపల్లిలో టీడీపీ నాయకులు ఘనంగా నిర్వహించారు. టీడీపీ మండల శాఖ అధ్యక్షుడు కొప్పిశెట్టి వెంకటేశ్ నేతృత్వంలో ఎన్టీఆర్ విగ్రహం వద్ద కేక్ కట్ చేసి బర్త్‌డే వేడుకలు జరుపుకున్నారు. అనంతరం నక్కపల్లి 50 పడకల ఆస్పత్రిలో రోగులకు పాలు, పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో జిల్లా ఐటీడీపీ అధ్యక్షుడు భీమరశెట్టి శ్రీనివాసరావు, గట్టెం రమేశ్, అల్లు మోహన్, మడదా రాంబాబు, గంట్యాడ రమేశ్, బాలెం నాగేశ్వరరావు పాల్గొన్నారు.

మునగపాకలో..

తెలుగుదేశం పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చింతకాయల విజయ్ పుట్టినరోజు వేడుకలను స్థానిక పార్టీ కార్యాలయంలో ఆదివారం నిర్వహించారు. టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి కర్రి సాయికృష్ణ , తెలుగు రైతు రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి దాడి ముసిలినాయుడు కేక్ కట్ చేశారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ తెలుగు యువత అధ్యక్షుడు పెంటకోట విజయ్, దాడి శివ, విల్లూరి నర్సింగరావు, పెంటకోట శ్రీరామ్మూర్తి, దాడి అప్పలనాయుడు పాల్గొన్నారు.

అంకితభావంతో పనిచేస్తేనే అభివృద్ధి

- ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్

అచ్యుతాపురం రూరల్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): ఉద్యోగులు అంకితభావంతో పనిచేస్తే పరిశ్రమలు అభివృద్ధి చెందుతాయని ఎలమంచిలి ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్ అన్నారు. సెజ్‌లోని రిబెస్ట్ కంపెనీ పదో వార్షికోత్సవ సభలో ఆయన మాట్లాడుతూ.. కంపెనీ యాజమాన్యం ఉద్యోగుల భద్రతపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ఈ సందర్భంగా ఉత్తమ ప్రతిభ కనబరిచిన ఉద్యోగులకు పారితోషకాలను అందజేశారు. 20 మంది విద్యార్థులకు 5 వేల స్కాలర్‌షిప్, 100 మందికి స్కూల్ బ్యాగులు, స్టేషనరీ బాక్సులను అందజేశారు.కార్యక్రమంలో రాష్ట్ర రహదారుల అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ ప్రగడ నాగేశ్వరరావు, గ్రూప్ డైరెక్టర్లు యమా, స్టీవ్, అశోక్, కంపెనీ ఉద్యోగులు కె.క్రాంతి కుమార్, మోహన్, జగన్, శ్యాంసుందర్, లక్ష్మీపతి, కె.రామ్ సురేష్ పాల్గొన్నారు.

ఉత్తరాంధ్ర మాలల సింహగర్జన విజయవంతం చేయాలి



సింహగర్జన పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న నాయకులు

కోటవురట్ల, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): వచ్చే నెల 8వ తేదీన విశాఖ గురుజాడ కళాక్షేత్రంలో జరగనున్న ఉత్తరాంధ్ర మాలల సింహగర్జనను విజయవంతం చేయాలని నర్సీపట్నం డివిజన్ మాల మహానాడు కన్వీనర్ చిట్ల చలపతి పిలుపునిచ్చారు. ఆదివారం మండల కేంద్రంలో సింహ గర్జన గోడ పత్రికను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సుప్రీంకోర్టు తీర్పును నిరసిస్తూ ఈ నిరసన కార్యక్రమం చేపడుతున్నామన్నారు. ఈ ఉద్యమానికి దళిత నాయకులు మద్దతు పలకాలని కోరారు. ఈ కార్యక్రమంలో దళిత నాయకులు నడింపల్లినూకరాజు, మట్ల గణేష్, సహదేవుడు, సప్పారపు వరహాలు, బచ్చల నూకరాజు పాల్గొన్నారు.

ఆధ్యాత్మిక సందడి.. వనభోజనాల హడావిడి

అయ్యప్పస్వామి శోభాయాత్ర



శోభాయాత్ర నిర్వహిస్తున్న భక్తులు

అనకాపల్లి టౌన్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని వేల్పుల వీధి పంబా పీఠం ఆధ్వర్యంలో ఆదివారం అయ్యప్పస్వామి శోభాయాత్రను అత్యంత వైభవంగా నిర్వహించారు. తొలుత స్వామివారికి ప్రత్యేక పూజలు చేపట్టారు. అనంతరం వివిధ రకాల పుష్పాలతో అలంకరించిన రథంపై స్వామి పంచలోహ విగ్రహాన్ని ఏర్పాటు చేసి కోలాటాలు, తప్పెటగుళ్లు, మేళతాళాలు, అయ్యప్ప భక్తుల శరణుఘోష నడుమ శోభాయాత్ర ముందుకు సాగింది. పీఠం నిర్వాహక కమిటీ సభ్యులు గుమ్మాల నాగేశ్వరరావు, ఒమ్మి రాము, ముత్త శ్రీనివాసరావు, బుదిరెడ్డి మురళీకృష్ణ, ఉగ్గిన అప్పారావులతో పాటు పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

పల్లెల్లో అమ్మవార్ల పండుగలు

సబ్బవరం, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని రావలమ్మపాలెంలో భూలోకమ్మ, పెదనాయుడుపాలెం, గొర్లివానిపాలెం గ్రామాల్లో పసలమ్మ పండుగలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. వందలామంది భక్తులు మేళతాళాలు, బాణసంచా కాల్పులతో అమ్మవార్ల సన్నిధికి తరలి వెళ్లి పూజలు చేసి మొక్కలు తీర్చుకున్నారు. ఈ వేడుకల్లో వైస్ ఎంపీపీ-2 చొక్కాకుల గోవింద, సర్పంచ్ సబ్బవరపు నారాయణమూర్తి, మాజీ ఎంపీపీ సబ్బవరపు ముత్యాలనాయుడు, దేముడు, రామునాయుడు, గొర్లి శ్రీను, సబ్బవరపు నాగేంద్ర, సత్యనారాయణ, బుజ్జి, నాయుడు, సురేష్, ప్రకాశ్, రామకృష్ణ, వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.



రావలమ్మపాలెంలో పూజా సామగ్రితో అమ్మవారి సన్నిధికి భక్తులు



సీతారాములను దర్శించుకుంటున్న భక్తులు

అచ్చెయ్యపేటలో సీతారాముల ఆలయ వార్షికోత్సవం

కొత్తూరు, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి) : అనకాపల్లి మండలం సుందరయ్యపేట పంచాయతీ అచ్చెయ్యపేటలో సీతారాముల ఆలయ వార్షికోత్సవాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వేకువజాము నుంచి విశేష పూజలు ప్రారంభమయ్యాయి. పెద్ద సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు. ఆలయం వద్ద సాయంత్రం పలు ఆధ్యాత్మిక, తోడపెద్దు సేవా కార్యక్రమాలు చేపట్టారు. ఈ కార్యక్రమాల్లో పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

బొజ్జన్నకొండ వద్ద పర్యాటకుల కోలాహలం



బొజ్జన్నకొండపైకి వెళ్తున్న పర్యాటకులు

తుమ్మపాల, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి) : ప్రముఖ పర్యాటక కేంద్రం బొజ్జన్నకొండ వద్ద ఆదివారం పర్యాటకుల సందడి నెలకొంది. కార్తీకమాసం పిక్నిక్‌ల సీజన్ కావడంతో జిల్లా నలుమూలల నుంచి పెద్ద సంఖ్యలో ఇక్కడికి తరలి వచ్చారు. కొండపై గల శిలా విగ్రహాలను, స్థూపాలను ఆసక్తిగా తిలకించారు. పలువురు గుహాలయాల్లో ప్రార్థనలు చేశారు. బొజ్జన్నకొండ చరిత్రను తెలుసుకునేందుకు ఉత్సాహం చూపారు. కొండ దిగువ భాగంలో గల పచ్చని మైదానంలో పిల్లలు, పెద్దలు అనే తేడా లేకుండా ఆట పాటలతో ఆనందంగా గడిపారు.



శివలింగం చుట్టూ అందమైన ముగ్గుల నడుమ దీపాలు

సాంబశివుని ఆలయం వద్ద దీపాలంకరణ



గణనాథున్ని చుట్టూ దీపాలంకరణ

అనకాపల్లి టౌన్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని చినరాజుపేటలో గల చౌడేశ్వరి సాంబశివుని ఆలయం వద్ద కార్తీకమాసంలో భాగంగా శనివారం రాత్రి నిర్వహించిన దీపాలంకరణ భక్తులను ఎంతగానో ఆకట్టుకుంది. సోమవారం జరిగే శూలాల మహోత్సవాన్ని పురస్కరించుకుని ఆలయ కమిటీ ప్రతినిధులు వివిధ దేవతామూర్తుల ఆకారాలను రోడ్లపై వేసి చుట్టూ దీపాలంకరణ చేపట్టారు. ఈ వేడుకను తిలకించేందుకు చుట్టు పక్కల నుంచి అధికసంఖ్యలో భక్తులు తరలివచ్చారు.

అనకాపల్లిలో మాజీ ప్రధాని పీవీ నరసింహారావు విగ్రహం ఏర్పాటుకు కృషి

- కూటమి ప్రభుత్వంలో బ్రాహ్మణులకు తగిన గుర్తింపు
- సంఘం కార్తీక వనసమారాధనలో ఎమ్మెల్యే కొణతాల



వన సమారాధనలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ

కశింకోట, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి) : కూటమి ప్రభుత్వంలో బ్రాహ్మణులకు తగిన గుర్తింపు ఉంటుందని ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ అన్నారు. ఇక్కడి బయ్యవరం ప్రమీలా రాణి తోటలో ఆదివారం జరిగిన బ్రాహ్మణ సేవా సంఘం కార్తీక వనసమారాధనలో ముఖ్య అతిథిగా మాట్లాడారు. బ్రాహ్మణులకు నామినేటెడ్ పదవుల్లో తగిన ప్రాధాన్యం కల్పిస్తామన్నారు. దివంగత మాజీ ప్రధాని పీవీ నరసింహారావు విగ్రహాన్ని అనకాపల్లిలో ఏర్పాటుకు కృషి చేస్తానని చెప్పారు. అదే విధంగా సినీగేయ రచయిత సిరివెన్నెల సీతారామశాస్త్రికి గుర్తుగా ఒక కార్యక్రమం ఏర్పాటుకు కృషి చేస్తామన్నారు. అనంతరం అక్కడ ఏర్పాటు చేసిన స్టాల్స్‌ను సందర్శించారు. అనంతరం సభ్యులంతా కొణతాలను శాలువాతో సత్కరించి మెమెంటోను అందజేశారు. ఈ కార్యక్రమంలో కూటమి నేతలు, బ్రాహ్మణ సంఘ నాయకులు పాల్గొన్నారు.

'ముడుపుల కేసులో అదానీని అరెస్టు చేయాలి'



ర్యాలీ నిర్వహిస్తున్న సీపీఎం మండల కార్యదర్శి సత్యవతి తదితరులు

సబ్బవరం, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి) : అంతర్జాతీయ స్థాయిలో అవినీతికి పాల్పడి, వేల కోట్ల రూపాయలు ముడుపులు చెల్లించి రాష్ట్ర ప్రజలపై అదనపు భారాలు మోపిన అదానీని తక్షణమే అరెస్టు చేయాలని సీపీఎం మండల కార్యదర్శి ఉప్పాడ సత్యవతి డిమాండ్ చేశారు. పార్టీ కార్యకర్తలు, భవన నిర్మాణ కార్మికులతో కలిసి ఆదివారం ఆమె ఇక్కడ నిరసన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యుత్ ఒప్పందాలు చేసుకున్న సదరు కంపెనీలపై కేసులు నమోదు చేయాలన్నారు. అంతేకాకుండా ఆ ఒప్పందాలను రద్దు చేసి, రాష్ట్ర ప్రజల సంపదను కాపాడాలని ఆమె ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు బర్ల రమణ, కె నూకరాజు, పలువురు కార్మికులు పాల్గొన్నారు.

యూటీఎఫ్ సబ్బవరం మండల కార్యవర్గం ఎన్నిక



అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి నాగరాజు, రమణ

సబ్బవరం, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయుల సమస్యల పరి ష్కారానికి యూటీఎఫ్ కృషి చేస్తుందని ఫెడరేషన్ జిల్లా కౌన్సిల్ అధ్యక్షురాలు వి.శ్రీలక్ష్మి అన్నారు. ఆదివారం ఇక్కడ ఏర్పాటు చేసిన యూటీఎఫ్ మండల కార్యవర్గ సమావేశంలో మాట్లాడారు. అనంతరం జిల్లా కౌన్సిల్ సభ్యుడు సీహెచ్. భాస్కరరావు అధ్యక్షతన మండల కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. గౌరవాధ్యక్షుడిగా పి.తమ్మారావు, అధ్యక్షుడిగా బి.నాగరాజు, సంయుక్త అధ్యక్షులుగా యు.స్వర్ణలత, ప్రధాన కార్యదర్శిగా కొరుపోలు వెంకటరమణ, కోశాధికారిగా ఎస్.కె.అజారుద్దీన్, ఉపాధ్యక్షురాలిగా త్రివేణి, కార్యదర్శులుగా కె.భాస్కరరావు, భీమేశ్వరిదేవి, వెంకటరెడ్డి, ఎ.ఆశాజ్యోతి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

'ఎన్టీపీసీ వ్యర్థాల కారణంగా చేపలు మృత్యువాత'

పరవాడ, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి) : సింహాద్రి ఎన్టీపీసీ విడుదల చేస్తున్న వ్యర్థ రసాయనాల కారణంగా ముత్యాలమ్మపాలెం ఉప్పుటేరులో మత్స్య సంపద మృత్యువాత పడుతుందని స్థానిక సర్పంచ్ చింతకాయల సుజాత, ఎంపీటీసీ సభ్యురాలు అర్జిల్లి దేవి ఆదివారం ఆరోపించారు. ఇష్టానుసారంగా వ్యర్థ రసాయనాలను పైపులైన్ల ద్వారా సముద్రంలోకి విడిచిపెట్టడం వల్ల చేపలు, రొయ్యలు, పీతలు మృత్యువాత పడి ఒడ్డుకు కొట్టుకొస్తున్నాయని పేర్కొన్నారు. దీని కారణంగా మత్స్యకారుల జీవనోపాధికి గండి పడుతుందని వాపోయారు. ఇదే విషయమై పొల్యూషన్ కంట్రోల్ బోర్డు అధికారులకు పలుమార్లు ఫిర్యాదులు చేసినా ఎలాంటి చర్యలు తీసుకోలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు.

అంధ ఉద్యోగుల సంఘం కార్యవర్గం ఎన్నిక



సమావేశమైన అంధ ఉద్యోగుల సంఘం నాయకులు

తుమ్మపాల, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి) : అంధ ఉద్యోగుల సంఘం జిల్లా కార్యవర్గాన్ని ఆదివారం స్థానిక సీపీఐ కార్యాలయంలో ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షుడిగా కొరుప్రోలు వెంకటేశ్వరరావు, ప్రధాన కార్యదర్శిగా పళ్ల పోతురాజు, అసోసియేట్ ప్రెసిడెంట్‌గా డాక్టర్ కోన బాబూరావు, ఆర్గనైజింగ్ సెక్రటరీగా గొల్లవిల్లి సురేష్‌కుమార్, మహిళా సెక్రటరీగా గరికిపాటి గౌతమి, కోశాధికారిగా కాట్రపల్లి వెంకటరమణ, ఉపాధ్యక్షునిగా పరిశెట్టి అప్పారావు, ఎస్.నాగమణి, జాయింట్ సెక్రటరీలుగా ఎం.అనూరాధ, శివశంకర్ ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమంలో కార్యవర్గ సభ్యులు దాసరి సింహాచలం, కిమిడి కాసులమ్మ, ఎల్.బుజ్జి, వి. అప్పారావు, గోకాడ రాజారావు తదితరులు పాల్గొన్నారు.

వీజేపాలెంలో అదుపు తప్పిన ప్రైవేటు బస్సు

కొత్తూరు, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి) : అనకాపల్లి మండలం వేటజంగాలపాలెం వద్ద ఓ ఫార్మా కర్మాగారం కార్మికులను తరలించే బస్సు ఆదివారం ఉదయం అదుపు తప్పి పక్కనే ఉన్న మటన్ షాపుపైకి దూసుకెళ్లింది. ఈ ప్రమాదంలో మటన్ షాపులో ఉన్న భార్య, భర్త ఇరువురికీ స్వల్ప గాయాలయ్యాయి. అయితే ఆ సమయంలో మటన్ కొనుగోలు చేసేందుకు ఎవరూ రాకపోవడంతో పెద్ద ప్రమాదం తప్పిందని స్థానికులు తెలిపారు. ఇదిలావుంటే, అనకాపల్లి నుంచి కూండ్రం వైపు బస్సు వెళ్తుండగా ఎదురుగా వస్తున్న లారీని తప్పించే క్రమంలో పక్కనే ఉన్న మటన్ షాపులోకి బస్సు దూసుకుపోయిందని పలువురు పేర్కొన్నారు.

పాఠశాలల్లో పూర్వ విద్యార్థులు సందడి



డీపీఎన్ స్కూల్‌లో వ్యవసాయం చేస్తున్న మిత్రులకు సన్మానం



అనకాపల్లి ఎంహెచ్‌స్కూల్‌లో కలాం విగ్రహాన్ని ఆవిష్కరించిన పూర్వ విద్యార్థులు

కశింకోట/అనకాపల్లి టౌన్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి) : ఇక్కడి డీపీఎన్ జిల్లా పరిషత్ హైస్కూల్‌లో ఆదివారం పూర్వ విద్యార్థులు సందడి చేశారు. ఇక్కడ 1988- 89 విద్యా సంవత్సరంలో పదో తరగతి చదువుకున్న వారంతా కలవడంతో కోలాహల వాతావరణం నెలకొంది. ఈ సందర్భంగా ఒకరినొకరు ఆప్యాయంగా పలుకరించుకుని, నాటి జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. తమతో విద్యాభ్యాసం చేసిన వారిలో వ్యవసాయం చేస్తున్నవారిని ఘనంగా సన్మానించారు. అనంతరం సాయంత్రం వరకు సరదాగా గడిపారు. అలాగే, అనకాపల్లిలోని పెద్ద హైస్కూల్‌లో 1998-99 బ్యాచ్‌కు చెందిన పదవ తరగతి పూర్వ విద్యార్థుల ఆదివారం కలుసుకున్నారు. ఈ సందర్భంగా అక్కడ సందడి వాతావరణం నెలకొంది. తొలుత వారంతా ఒకరి యోగక్షేమాలు ఒకరు తెలుసుకున్నారు. తమ చిన్ననాటి తీపిజ్ఞాపకాలను గుర్తుచేసుకున్నారు. అంతేకాక ఈ 25 సంవత్సరాల తీపి గుర్తుగా అబ్దుల్ కలాం విగ్రహావిష్కరణ కూడా చేపట్టారు. ఈ వేడుకకు ఉపాధ్యాయులు నరసింగరావు, సత్యం, దుర్గాప్రసాద్, సన్యాసిరావు తదితరులు విచ్చేశారు.

'అగ్రిగోల్డ్ బాధితుల సమస్య శాశ్వత పరిష్కారానికి ప్రణాళిక'

తుమ్మపాల, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి) : అగ్రిగోల్డ్ బాధితుల సమస్య పరిష్కారానికి త్వరలోనే పక్కా ప్రణాళికతో ముందుకు వెళుతున్నట్లు సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, అగ్రిగోల్డ్ బాధితులు, ఏజెంట్ల వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర గౌరవాధ్యక్షుడు ముప్పాళ్ళ నాగేశ్వరరావు తెలిపారు. ఇక్కడి పార్టీ కార్యాలయంలో ఆదివారం జరిగిన అగ్రిగోల్డ్ అసోసియేషన్ జిల్లా సమావేశంలో మాట్లాడారు. అగ్రిగోల్డ్ యాజమాన్యం బాధితులకు శఠగోపం పెట్టి వచ్చే జనవరి నాల్గవ తేదీ నాటికి పదేళ్లు అవుతుందన్నారు. ఇక సమస్య పరిష్కారమే లక్ష్యంగా ఉద్యమించడానికి సిద్ధమైనట్లు చెప్పారు. రాష్ట్ర వ్యాప్తంగా శాసన సభ్యులకు అగ్రిగోల్డ్ బాధితుల సమస్యలపై వినతిపత్రాలు ఇచ్చామన్నారు. కానీ ఏ ఒక్క ఎమ్మెల్యే అసెంబ్లీలో ఆ విషయం ప్రస్తావించకపోవడం దురదృష్టకరమన్నారు. శాసన మండలిలో పీడీఎఫ్ ఎమ్మెల్సీ అగ్రిగోల్డ్ విషయం ప్రస్తావనకు తీసుకురావడం శుభపరిణామంగా పేర్కొన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకు కూడా ఏడు అంశాలతో కూడిన వినతిపత్రాన్ని అందజేస్తామని తెలిపారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వి.తిరుపతిరావు మాట్లాడుతూ బాధితులంతా ఐక్యంగా ఉద్యమిస్తే సమస్య సత్వరమే పరిష్కారమవుతుందన్నారు. ఈ సమావేశంలో రాష్ట్ర అధ్యక్షులు ఇ.వి. నాయుడు, రాష్ట్ర ఉప ప్రధానకార్యదర్శి బి.చంద్రశేఖర్‌రావు, జిల్లా గౌరవాధ్యక్షులు వైఎన్ భద్రం, సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి రాజాన దొరబాబు, జిల్లా అధ్యక్ష, కార్యర్శులు కరణం మాణిక్యాలరావు, మొల్లేటి గోపాల రమణ, కోన లక్ష్మణ, కోరిబిల్లి శంకరరావు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న రాష్ట్ర గౌరవాధ్యక్షుడు నాగేశ్వరరావు

'ఏఎంఏఎల్'లో ఘనంగా ఎన్‌సీసీ దినోత్సవం

కొత్తూరు, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి) : ఇక్కడి ఏఎంఏఎల్ కళాశాలలో ఎన్‌సీసీ దినోత్సవాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన కళాశాల కరస్పాండెంట్ దాడి శ్రీనివాసరావు మాట్లాడుతూ ఎన్‌సీసీలో చేరడం వల్ల అకడమిక్ సర్టిఫికెట్‌తో పాటు బి, సి సర్టిఫికెట్లు పొందవచ్చన్నారు. ఇవి ఉన్నత చదువులకు మంచి అవకాశంతో పాటు వివిధ దళాల్లో చేరేందుకు ఎంతో ఉపయోగపడతాయని వివరించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ గెల్లా జయబాబు మాట్లాడుతూ ఎన్‌సీలో శిక్షణ పొందడం వల్ల ఎన్నో ఉపయోగాలు ఉన్నాయన్నారు. అనంతరం వాలీబాల్, క్రికెట్, త్రోబాల్, కబడ్డీ పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. ఆ తరువాత కళాశాల ఆవరణలో మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ నిరంజన్‌కుమార్, ఎన్‌సీపీ ఆఫీసర్లు కెప్టెన్ దాడి జగదీష్, ఏఎస్ఎన్ మూర్తి, సూపరింటెండెంట్ అనురాధ తదితరులు పాల్గొన్నారు.

శారదానగర్‌లో మద్యం దుకాణం తొలగించాలి

కొత్తూరు, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి) : మేజర్ పంచాయతీ కొత్తూరు శారదానగర్‌లో ఏర్పాటు చేసిన మద్యం దుకాణాన్ని తొలగించాలని శారదా సంక్షేమ సంఘం సభ్యులు డిమాండ్ చేశారు. ఈ మేరకు పంచాయతీ కార్యాలయం వద్ద ఉన్న మహాత్మా గాంధీ విగ్రహానికి వారంతా వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సభ్యులు తాడి శ్రీనివాస్ చక్రవర్తి, ఆడారి శాంతి తదితరులు మాట్లాడుతూ శారదానగర్ ప్రాంతంలో మద్యం దుకాణాన్ని ఏర్పాటు చేయరాదని చేపట్టిన పంచాయతీ తీర్మానాన్ని గౌరవించాలని కోరారు. నిత్యం విద్యార్థులు, మహిళలు తిరిగే ఈ ప్రాంతంలో మద్యం దుకాణం ఏర్పాటు చేయడాన్ని వ్యతిరేకిస్తున్నామని తెలిపారు. తక్షణమే మద్యం దుకాణాన్ని వేరొక ప్రాంతానికి తరలించాలని డిమాండ్ చేశారు.



గాంధీ విగ్రహానికి వినతి పత్రం అందిస్తున్న సంఘం సభ్యులు

'26న ఆందోళనలను విజయవంతం చేయండి'

అనకాపల్లి టౌన్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి) : కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అవలంభిస్తున్న కార్మిక, రైతు ప్రజా వ్యతిరేక విధానాలపై ఈ నెల 26న దేశవ్యాప్తంగా నిర్వహించే ఆందోళన కార్యక్రమాలను విజయవంతం చేయాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఆర్.శంకరరావు పిలుపునిచ్చారు. ఇక్కడి జీవీఎంసీ కార్యాలయం వద్ద ఆదివారం జరిగిన మున్సిపల్ కార్మికుల సమావేశంలో మాట్లాడారు. బీజేపీ మూడోసారి అధికారంలోకి వచ్చిన తరువాత కార్మిక, రైతు ప్రజా వ్యతిరేక విధానాలను తీవ్రతరం చేస్తుందన్నారు. కార్మిక చట్టాలను సడలించి లేబర్ కోడ్‌లు కింద మార్చిందని వివరించారు. కనీస వేతనాలు అమలు కాకుండా చట్టాలు మార్చడం వల్ల కార్మికులు ఇబ్బందులు పడుతున్నారని వివరించారు. రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధర లేదని, నిత్యావసర వస్తువుల ధరలు విపరీతంగా పెరుగుతున్నాయని పేర్కొన్నారు. వీటన్నింటిపై చేపట్టనున్న ఆందోళనలను విజయంతం చేయాలని కోరారు. ఈ సమావేశంలో వర్కర్స్ యూనియన్ గౌరవాధ్యక్షుడు గంటా శ్రీరామ్, ఎస్.అజయ్, ఓంశివ, బొమ్మల నాగరాజు, శ్రీను తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా అధ్యక్షుడు శంకరరావు

పరవాడ : రైతులు, కార్మికుల సమస్యలను కేంద్ర ప్రభుత్వం పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ దేశవ్యాప్తంగా మంగళవారం చేపట్టనున్న ఆందోళనను జయప్రదం చేయాలని కోరుతూ ఫార్మాసిటీలో ఆదివారం సీఐటీయూ ఆధ్వర్యంలో బైక్ ర్యాలీ నిర్వహించారు. యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి జి.కోటేశ్వరరావు, ఉపాధ్యక్షుడు గనిశెట్టి సత్యనారాయణ, కోశాధికారి వీవీ శ్రీనివాసరావు, కర్రి పోతునాయుడు, చిన్నారావు, సత్తిబాబు, కృష్ణ, రాజు, దొరబాబు పాల్గొన్నారు.

నేడు టీడీపీ ఆత్మీయ సమావేశం

పరవాడ, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి) : టీడీపీ ఆత్మీయ సమావేశాన్ని పరవాడ మరిడిమాంబ కల్యాణ మండపంలో సోమవారం ఏర్పాటు చేస్తున్నట్టు ఆ పార్టీ మండల శాఖ అధ్యక్షుడు వియ్యపు చిన్న తెలిపారు. టీడీపీ పెందుర్తి నియోజకవర్గం ఇన్‌చార్జి, ఏపీ కోపరేటివ్ ఆయిల్ సీడ్స్ గ్రోవర్స్ ఫెడరేషన్ చైర్మన్ గండి బాబ్జి ముఖ్య అతిథిగా హాజరు కానున్నారన్నారు. సమన్వయ కమిటీ సభ్యులు, కార్పొరేటర్లు, మాజీ ఎంపీపీలు, మాజీ జడ్పీటీసీలు, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు , కార్యకర్తలు పాల్గొనాల్సిందిగా ఆయన కోరారు.

బెల్టు షాపులను అరికట్టాలి : ఐద్వా

అనకాపల్లి టౌన్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి) : బెల్టుషాపులను అరికట్టాలని ఐద్వా జిల్లా ప్రతినిధులు రావి లక్ష్మి, గంటా సుభాషిణి డిమాండ్ చేశారు. ఆదివారం ఇక్కడ విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రైవేటు వ్యక్తులకు లబ్ధి చేకూర్చే విధంగా మద్యం పాలసీ తీసుకు రావడంతో బెల్టుషాపులు పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తున్నాయన్నారు. గ్రామ గ్రామాన మద్యం అమ్మకాలు సాగడంతో మహిళలపై దాడులు జరుగుతున్నాయని, వీటిని ప్రభుత్వం అరికట్టాలని కోరారు. అనకాపల్లిలో బార్లు ద్వారా అక్రమ మద్యం వ్యాపారం జరుగుతుందని ఆరోపించారు. విశాఖలో లా విద్యార్థినిపై లైంగిక దాడికి పాల్పడిన వారిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు.

20 మద్యం బాటిళ్లతో మహిళపై కేసు

అనకాపల్లి టౌన్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలో మద్యం కొనుగోలు చేసి తీసుకువెళ్తున్న మహిళ నుంచి ఇరవై క్వార్టర్ బాటిళ్లను స్వాధీనం చేసుకున్నట్టు ఎస్ఐ కె.సంతోష్‌కుమార్ తెలిపారు. మెట్టపాలెం పంచాయతీ జగన్నాథపురం గ్రామానికి చెందిన మువ్వల స్వాతి అనే మహిళ అనకాపల్లిలో ఆదివారం మద్యం బాటిళ్లు కొనుగోలు చేసిందన్నారు. స్వగ్రామానికి తీసుకెళ్తుండగా తుమ్మపాలలోని వెంకుపాలేనికి వెళ్లే రోడ్డులో అనుమానం వచ్చి తనిఖీ చేయగా క్వార్టర్ బాటిళ్లు ఉన్నట్టు చెప్పారు. ఈ మేరకు ఆమెపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ చెప్పారు.

బీసీ సంఘ నేత 'బోయిన'కు సన్మానం

కశింకోట, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి) : జాతీయ బీసీ సం క్షేమ సంఘం రాష్ట్ర అదనపు ప్రధాన కార్యదర్శిగా నియామకమైన బోయిన భానుమూర్తి యాదవ్‌ను కశింకోట కాంగ్రెస్ నేతలు ఆదివారం సత్కరించారు. నాయకులు మాడేపు నాయుడు, వాయిబోయిన రాజు, గజ్జలు తదితరులు పాల్గొన్నారు.

ముమ్మరంగా వరి కోతలు

పరవాడ, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పలు గ్రామాల్లో వరి చేను కోతలు ముమ్మరంగా సాగుతున్నాయి. ఈ ఏడాది వర్షాలు అనుకున్నంత మేర కురవడంతో పంట దిగుబడి బాగానే ఉంది. రైతులంతా పొలం పనుల్లో పూర్తిగా నిమగ్నమయ్యారు. మండల కేంద్రం పరవాడ, రావాడ, స్వయంభూవరం, తానాం పరిసర గ్రామాల్లో వరి చేను కోతలు ఊపందుకున్నాయి. ఓపక్క మహిళా రైతులు వరిచేను కోస్తుండగా, మగ రైతులు వాటిని కుప్పలు వేసే పనిలో ఉన్నారు. అయితే రానున్న రెండు, మూడు రోజుల్లో తుఫాన్ ప్రభావంతో వర్షాలు కురుస్తాయన్న వాతావరణ శాఖ హెచ్చరికలు నేపథ్యంలో వారంతా ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

జీసీసీ చైర్మన్ శ్రావణ్‌కుమార్‌కు ఘన స్వాగతం

» ఘాట్‌లోని అమ్మవారి పాదాల నుంచి పాడేరు వరకు ఊరేగింపు

» మోదకొండమ్మకు ప్రత్యేక పూజలు » భారీ తరలి వచ్చిన టీడీపీ శ్రేణులు



పాడేరులో ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసిన శ్రావణ్‌కుమార్, గిడ్డి ఈశ్వరి తదితరులు



కిడారి ఘాట్‌లో తండ్రి సర్వేశ్వరరావుకు నివాళి

పాడేరు, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి) : గిరిజన సహకార సంస్థ చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించిన తర్వాత తొలిసారిగా ఆదివారం మన్యానికి విచ్చేసిన టీడీపీ పార్లమెంటరీ అధ్యక్షుడు, మాజీ మంత్రి కిడారి శ్రావణ్ కుమార్‌కు ఘన స్వాగతం లభించింది. టీడీపీ పాడేరు, అరకులోయ అసెంబ్లీ నియోజకవర్గాల ఇన్‌చార్జులు గిడ్డి ఈశ్వరి, సియ్యారి దొన్నుదొర, పార్టీ శ్రేణులు ఘాట్‌లోని అమ్మవారి పాదాల వద్ద ఆయనకు పూలమాలలు వేసి ఘనంగా స్వాగతం పలికారు. అలాగే ఆయన అమ్మవారి పాదాలు వద్ద ప్రత్యేక పూజలు అనంతరం భారీ ఊరేగింపుగా పాడేరు చేరుకున్నారు. తొలుత దివంగత ముఖ్యమంత్రి ఎన్టీఆర్ విగ్రహానికి, రాజ్యాంగ నిర్మాత అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. తర్వాత మోదకొండమ్మ ఆలయానికి చేరుకుని అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా జీసీసీ చైర్మన్ శ్రావణ్‌కుమార్, డైరెక్టర్ బొర్రా నాగరాజులకు టీడీపీ శ్రేణులు, ఆలయ కమిటీ ప్రధాన కార్యదర్శి కోటి బాబునాయుడు, సభ్యులు శాలువా కప్పిలు, మోదకొండమ్మ చిత్రపటాలను జ్ఞాపికగా అందించి సత్కరించారు. అనంతరం స్థానిక కిడారి ఘాట్‌కు చేరుకుని ఆయన తండ్రి, దివంగత ఎమ్మెల్యే కిడారి సర్వేశ్వరరావుకు నివాళులర్పించారు. అక్కడి నుంచి వాహనాలతో ఊరేగింపుగా హుకుంపేట, డుంబ్రిగుడ మండల కేంద్రాల మీదుగా అరకులోయ వెళ్లారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నేతలు పాండురంగస్వామి, బాకూరు వెంకటరమణరాజు, చల్లంగి లక్ష్మణరావు, బొర్రా విజయరాణి, గంగపూజారి శివకుమార్, డప్పొడి వెంకటరమణ, సర్పంచ్ కొట్టగుల్లి ఉషారాణి, జనసేన మహిళా నేత కిట్లంగి పద్మ, ఏజెన్సీలోని పదకొండు మండలాలకు చెందిన టీడీపీ నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎట్టకేలకు కొయ్యూరులో

జాతీయ బ్యాంకు ఏర్పాటుకు సన్నాహాలు

కొయ్యూరు, నవంబరు 24 : ఎట్టకేలకు కొయ్యూరులో జాతీయ బ్యాంకు ఏర్పాటుకు రంగం సిద్ధమైంది. ఇందుకు యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ముందుకు వచ్చింది. వ్యాపార వసతికి గానూ కొయ్యూరులో భవనం అద్దెకు తీసుకునేందుకు రీజనల్ హెడ్ ఆదివారం టెండరు ప్రకటన చేశారు. దీంతో రెండున్నర దశాబ్దాలుగా మండల వాసుల జాతీయ బ్యాంకు కల సాకారం కానుంది. కొయ్యూరులో ఇప్పటి వరకు గ్రామీణ వికాస బ్యాంకు పనిచేస్తుంది. అయితే ఈ బ్యాంకు కేవలం డిపాజిట్ సేకరణ, డ్వాక్రా మహిళలకు రుణ మంజూరు క్రాప్ లోన్లు ఇవ్వడం వరకే పరిమితమైంది. బంగారంపై రుణాలు ఇవ్వడం, లాకర్ సదుపాయం తదితర సేవలు ఈ బ్యాంకు ద్వారా అందుబాటులో లేవు. ఇక్కడి పరిస్థితులను గుర్తించిన ప్రస్తుత కూటమి ప్రభుత్వం యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ప్రతినిధులతో మాట్లాడి బ్యాంకు ఏర్పాటుకు చర్యలు తీసుకుంది. ఇందుకు వీలుగా బ్యాంకు వ్యాపార వసతికి గానూ కొయ్యూరులో భవనం అద్దెకు తీసుకునేందుకు రీజనల్ హెడ్ ఆదివారం వాపత్రికల్లో టెండరు ప్రకటన చేశారు. త్వరలో కొయ్యూరులో జాతీయ బ్యాంకు ఏర్పాటుకు సన్నహాలు ముమ్మరమయ్యాయి. దీంతో పలువురు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

మన్యాన్ని వీడని పొగ మంచు



పాడేరులో ఆదివారం ఉదయం కురుస్తున్న పొగమంచు

పాడేరు, నవంబరు 24 (ఆంధ్ర జ్యోతి) : బంగాళాఖాతంలో అల్పపీడన ప్రభావం ఉన్నప్పటికీ మన్యంలో పొగమంచు తీవ్రత తగ్గలేదు. ఎప్పటిలాగానే ఆదివారం ఉదయం కమ్మేసింది. తెల్లవారుజాము నుంచి ఉదయం ఎనిమిది గంటల వరకు జిల్లా కేంద్రం పాడేరు, పరిసర ప్రాంతాల్లో దట్టంగా కురిసింది. వాకింగ్‌కు వెళ్లేవారితో పాటు వ్యవసాయ ఉత్పత్తులను విక్రయాలకు తీసుకు వచ్చేవారు, వివిధ పనులపై బయటకు వెళ్లినవారు, వాహనచోదకులు కాస్త ఇబ్బందులు ఎదుర్కొన్నారు. అయితే సెలవు దినం కావడంతో మన్యానికి విచ్చేసిన పర్యాటకులు మాత్రం ఈ ప్రకృతి అందాలను ఆస్వాదించారు.

భక్తులతో మోదకొండమ్మ ఆలయం కిటకిట



మోదకొండమ్మను దర్శించుకుంటున్న భక్తులు

పాడేరురూరల్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి) : ఉత్తరాంధ్ర ప్రజల ఆరాధ్య దేవత పాడేరు మోదకొండమ్మ ఆలయం ఆదివారం భక్తులతో కిటకిటలాడింది. అమ్మవారి దర్శనానికి పెద్ద సంఖ్యలో భక్తులు ఉదయం ఆరు గంటల నుంచే బారులు తీరారు. అయ్యప్ప, భవానీ, శివ మాలధారులతో పాటు మైదాన ప్రాంతంలోని వివిధ ప్రాంతాల నుంచి మొక్కులు తీర్చుకొనేందుకు వచ్చిన వారితో ఆలయ ప్రాంగణం సాయంత్రం వరకు కళకళలాడింది. కొందరు ఘటాలను సమర్పించి పండగను జరుపుకున్నారు. ఆలయ కమిటీ ప్రధాన కార్యదర్శి కిల్లు కోటిబాబు నాయుడు ఆధ్వర్యంలో కమిటీ ప్రతినిధులు అన్నప్రసాదాన్ని పంపిణీ చేశారు. ఆలయ, ప్రసాద కమిటీ ప్రతినిధులు దన్నేటిపలాసి రాము, బి.వెంకటరమణ, సీహెచ్.రామకృష్ణ, డి.పి.రంజిత్‌కుమార్, జి.శంకరరావు, కె.చంద్రమోహన్‌కుమార్, దేముడు, ఎల్.రత్నాబాయి, కొండలరావు ఏర్పాట్లను పర్యవేక్షించారు. అదే విధంగా ఘాట్‌లోని మోదాపల్లి జంక్షన్ వద్ద గల అమ్మవారి పాదాల వద్ద పెద్ద సంఖ్యలో భక్తులు పూజలు చేశారు.

సంతలో జోరుగా బంతిపూల విక్రయం

సీలేరు, నవంబరు 24 , (ఆంధ్రజ్యోతి) : ఇటు కార్తీక మాసం.. అటు అయ్యప్ప, భవానీ, శివ తదితర దేవతల మాలధారణలు.. వెరసి ఎటు చూసినా ఆధ్యాత్మిక శోభ సంతరించుకుంటోంది. దీంతో పువ్వులకు తెగ డిమాండ్ ఏర్పడింది. పరిసర ప్రాంతాల్లో పండించే బంతిపూలు ఆదివారం సీలేరు సంతకు తేగానే హాట్ కేకుల్లా అమ్ముడుపోయాయి. దుప్పులవాడ పంచాయతీ పరిధి పిల్లిగెడ్డ, కాట్రగెడ్డ, జొన్నమామిడి, జి.నేరుడుపల్లి, ఎస్.నేరేడుపల్లి తదితర గ్రామాల్లో గిరిజనులు బంతి సాగు అధికంగా చేపడుతుంటారు. వారపులకు వాటిని తీసుకు వెళ్లి విక్రయిసుంటారు. ఇందులో భాగంగానే ఇక్కడకు బుట్టలు, కావిళ్లతో తేగా చకచకా అమ్ముడయ్యాయి.

జిల్లాస్థాయి భజన గీతాల పోటీలకు విశేష స్పందన



భజన పోటీలను ప్రారంభిస్తున్న అరుణానంద స్వామిజీ

చింతపల్లి, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రం చింతపల్లి మార్కెట్ యార్డులో నిర్వహించిన జిల్లాస్థాయి భక్తి భజన గీతాల పోటీలకు ఆదివాసీ భక్తుల నుంచి విశేష స్పందన లభించింది. ఆదివారం దానధర్మ చారిటబుల్ ట్రస్టు భక్తి భజన గీతాల పోటీలు ఏర్పాటు చేసింది. ఈపోటీలకు జిల్లా వ్యాప్తంగా 18 భజన బృందాలు హాజరయ్యాయి. ప్రథమ స్థానాన్ని ఎం.మాకవరం, ద్వితీయ స్థానాన్ని రామన్నపాలెం, తృతీయ స్థానాన్ని తాజంగి సొలబం బృందాలు దక్కించుకోవడంతో నగదు బహుమతులు అందించారు. ఈ కార్యక్రమంలో అరుణానంద స్వామీజీ దానధర్మ చారిటబుల్ ట్రస్టు ప్రతినిధి ప్రదీప్, సూర్య, దుర్గా ప్రసాద్, ధార్మిక సేవా ప్రతినిధి డీవీవీ ప్రసాద్, నిర్వాహకులు దేపూరి వెంగళయ్య, గంపరాయి విజయ కుమార్, కాగి అశోక్, కొండబాబు, బాలకృష్ణ పాల్గొన్నారు.

కొడుకు హత్య కేసులో తండ్రి అరెస్టు

» వివరాలు వెల్లడించిన సీఐ వరప్రసాద్, ఎస్ఐ రవీంద్ర



నిందితుడు చిత్రోను చూపుతున్న సీఐ, ఎస్ఐ

సీలేరు, నవంబరు 24, (ఆంధ్రజ్యోతి) : జీకే వీధి మండలం సీలేరు పోలీసు స్టేషన్ పరిధిలో ఇటీవల జరిగిన హత్య సంఘటనకు సంబంధించి నిందితుడ్ని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించామని జీకేవీధి సీఐ వరప్రసాద్ తెలిపారు. ఇందుకు సంబంధించి ఆయన కథనం ప్రకారం వివరాలివి. జీకేవీధి మండలం ధారకొండ ఏనుగు బైలుకు చెందిన కొర్రా సన్యాసిరావు (40) నిత్యం మద్యం సేవించి అతని భార్యను, తల్లిదండ్రులను కొడుతూ వేధించేవాడు. ఈ క్రమంలోనే ఈ నెల 14వ తేదీన సన్యాసిరావు భార్యా వంటి చేసి పొలంలో ఉన్న తన మామ కొర్రా చిత్రోకు భోజనం తీసుకు వెళ్లింది. దీంతో మద్యం మత్తులో ఉన్న సన్యాసిరావు ఆమెను కొట్టడంతో తన పుట్టింటికి వెళ్లిపోయింది. అనంతరం అతని తండ్రితో గొడవపడి కత్తి పట్టుకుని వెంబడించడంతో చిత్రో సమీపంలోని అటవీ ప్రాంతానికి పారిపోయాడు. తనను కొడుకు ఎలాగైనా హత మారుస్తాడని భావించిన తండ్రి చిత్రో పొదలు మాటున ఉండి కొడుకు అటుగా రాగానే తన వద్ద ఉన్న గొడ్డలితో గట్టిగా కొట్టడంతో సన్యాసిరావు అక్కడికక్కడే మృతి చెందాడని సీఐ చెప్పారు. అనంతరం అక్కడే అటవీశాఖ తవ్వించిన ట్రెంచ్‌లో మృతహాన్ని పూడ్చిపెట్టినట్టు వివరించారు.

పుట్టింటికి వెళ్లిపోయిన భార్య ఈ నెల 21న ఇంటికి రావడంతో భర్త కనిపించ లేదు. దీనిపై మామ చిత్రోను నిలదీయగా జరిగిన విషయాన్ని ఆమెకు వివరించాడు. ఈ సంఘటనపై ఆమె పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేశామని సీఐ వివరించారు. నిందితుడ్ని శనివారం సాయంత్రం అరెస్టు చేసి ఆదివారం రిమాండ్‌కు తరలించినట్టు చెప్పారు. ఈ సమావేశంలో ఎస్ఐ రవీంద్ర పాల్గొన్నారు.

ఆదివాసీలు గంజాయి సాగు, రవాణకు దూరంగా ఉండాలి : సీఐ



మామిడిపల్లిలో మాట్లాడుతున్న సీఐ

చింతపల్లి, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): ఆదివాసీలు గంజాయి సాగు, రవాణకు దూరంగా ఉండాలని స్థానిక సర్కిల్ ఇన్‌స్పెక్టర్ ఎం.వినోద్ బాబు అన్నారు. గంజాయి వల్ల కలిగే నష్టాలపై ఆదివారం మామిడిపల్లిలో గిరిజనులతో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గంజాయి వల్ల యువత విలువైన జీవితాలను నాశనం చేసుకుంటున్నారన్నారు. గంజాయితో పట్టుబడిన వ్యక్తుల ఆస్తులను సైతం జప్తు చేస్తామన్నారు. అలాగే మావోయిస్టు కార్యకలాపాల జోలికి వెళ్లరాదన్నారు. ఈ కార్యక్రమంలో అన్నవరం ఎస్ఐ వెంకటరమణ, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

అవుట్‌సోర్సింగ్‌లో ఉన్నవారిని కాంట్రాక్టు ఉపాధ్యాయులుగా మార్చాలి



దీక్షలకు మద్దతు తెలిపిన యూటీఎఫ్ నేతలు

పాడేరు రూరల్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి) : ఆంధ్రప్రదేశ్ గిరిజన గురుకుల పాఠశాలలు, కళాశాలల్లో విధులు నిర్వహిస్తున్న అవుట్ సోర్సింగ్ ఉపాధ్యాయ, అధ్యాపకులను కాంట్రాక్టు ఉపాధ్యాయులు (సీఆర్టీ)లుగా మార్పు చేయాలని యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి వి.మహేశ్వరరావు, జిల్లా సహాయ అధ్యక్షులు చీకటి నాగేశ్వరరావు డిమాండ్ చేశారు. సమస్యలు పరిష్కారం కోరుతూ ఐటీడీఏ ఎదుట గత తొమ్మిది రోజులుగా నిరాహార దీక్షలు చేపడుతున్న గురుకుల ఉద్యోగుల శిబిరాన్ని ఆదివారం సందర్శించి వారికి మద్దతు తెలిపారు. యూటీఎఫ్ జిల్లా నాయకులు ఎం.శ్రీనివాస్, ఎస్.గంగాధర్, జి.సతీష్, కె.ఈశ్వరరావు, హేమంత్ పాల్గొన్నారు.

పాలిథిన్ కవర్ల నిషేధంపై సంతలో ప్రచారం

సీలేరు, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని సీలేరు వారపు సంతలో ప్లాస్టిక్ నిషేదంపై ఆదివారం సర్పంచ్ ఆధ్వర్యంలో సచివాలయ సిబ్బంది అవగాహన కల్పించారు. జిల్లా కలెక్టర్, ఐటీడీఏ పీవో ఆదేశాల మేరకు డిసెంబరు ఒకటి నుంచి ప్లాస్టిక్ వాడకాన్ని నిషేధిస్తున్నట్టు చెప్పారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ పి.దుర్గో, ఉప సర్పంచ్ కె.వల్లీప్రసాద్, సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

రేవుపోలవరం తీరంలో పర్యాటకుల సందడి



పర్యాటకులతో కిటకిటలాడుతున్న రేవుపోలవరం తీరం

ఎస్.రాయవరం, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రేవుపోలవరం సముద్ర తీరం ఆదివారం పర్యాటకులతో కిటకిటలాడింది. కార్తీకమాసం పురస్కరించుకొని పిక్నిక్ ల కోసం అధికసంఖ్యలో సందర్శకులు తరలి వచ్చారు. సముద్రంలో జలకాలు ఆడుతూ సరదాగా గడిపారు. మధ్యాహ్నం అందరూ కలిసి భోజనాలు చేశారు. ప్రమాదాలు జరగకుండా పెంటకోట మెరైన్ పోలీసులు గస్తీ నిర్వహించారు.

అనకాపల్లిలో మాజీ ప్రధాని పీవీ విగ్రహం ఏర్పాటుకు కృషి

» సంఘం కార్తీక వనసమారాధనలో ఎమ్మెల్యే కొణతాల



వన సమారాధనలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ

కశింకోట, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి) : కూటమి ప్రభుత్వంలో బ్రాహ్మణులకు తగిన గుర్తింపు ఉంటుందని ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ అన్నారు. ఇక్కడి బయ్యవరం ప్రమీలా రాణి తోటలో ఆదివారం జరిగిన బ్రాహ్మణ సేవా సంఘం కార్తీక వనసమారాధనలో ముఖ్య అతిథిగా మాట్లాడారు. బ్రాహ్మణులకు నామినేటెడ్ పదవుల్లో తగిన ప్రాధాన్యం కల్పిస్తామన్నారు. దివంగత మాజీ ప్రధాని పీవీ నరసింహారావు విగ్రహాన్ని అనకాపల్లిలో ఏర్పాటుకు కృషి చేస్తానని చెప్పారు. అదే విధంగా సినీగేయ రచయిత సిరివెన్నెల సీతారామ శాస్త్రికి గుర్తుగా ఒక కార్యక్రమం ఏర్పాటుకు కృషి చేస్తామన్నారు. అనంతరం అక్కడ ఏర్పాటు చేసిన స్టాల్స్‌ను సందర్శించారు. అనంతరం సభ్యులంతా కొణతాలను శాలువాతో సత్కరించి మెమోంటోను అందజేశారు. ఈ కార్యక్రమంలో కూటమి నేతలు, బ్రాహ్మణ సంఘ నాయకులు పాల్గొన్నారు.

'అగ్రిగోల్డ్ బాధితుల సమస్య పరిష్కారానికి ప్రణాళిక'

తుమ్మపాల(అనకాపల్లి), నవంబరు 24 (ఆంధ్రజ్యోతి) : అగ్రిగోల్డ్ బాధితుల సమస్య పరిష్కారానికి త్వరలోనే పక్కా ప్రణాళికతో ముందుకు వెళుతున్నట్లు సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, అగ్రిగోల్డ్ బాధితులు, ఏజెంట్ల వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర గౌరవాధ్యక్షుడు ముప్పాళ్ళ నాగేశ్వరరావు తెలిపారు. ఇక్కడి పార్టీ కార్యాలయంలో ఆదివారం జరిగిన అగ్రిగోల్డ్ అసోసియేషన్ జిల్లా సమావేశంలో మాట్లాడారు. అగ్రిగోల్డ్ యాజమాన్యం బాధితులకు శఠగోపం పెట్టి వచ్చే జనవరి నాల్గోవ తేదీ నాటికి పదేళ్లు అవుతుందన్నారు. ఇక సమస్య పరిష్కారమే లక్ష్యంగా ఉద్యమించడానికి సిద్ధమైనట్లు చెప్పారు. రాష్ట్ర వ్యాప్తంగా శాసన సభ్యులకు అగ్రిగోల్డ్ బాధితుల సమస్యలపై వినతిపత్రాలు ఇచ్చామన్నారు. కానీ ఏ ఒక్క ఎమ్మెల్యే అసెంబ్లీలో ఆ విషయం ప్రస్తావించకపోవడం దురదృష్టకరమన్నారు. శాసనమండలిలో పీడీఎఫ్ ఎమ్మెల్సీ అగ్రిగోల్డ్ విషయం ప్రస్తావనకు తీసుకురావడం శుభపరిణామంగా పేర్కొన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబుకు కూడా వినతిపత్రాన్ని అందజేస్తామని తెలిపారు.

గిరిజనాభివృద్ధే లక్ష్యంగా పనిచేస్తాం

జీసీసీ చైర్మన్ కిడారి శ్రావణ్‌కుమార్, ఆర్టీసీ విజయనగరం రీజియన్ చైర్మన్ దొన్నుదొర స్పష్టీకరణ



అరకులోయలో జీసీసీ చైర్మన్ కిడారి శ్రావణ్‌కుమార్‌ను పూలమాలతో సత్కరిస్తున్న ఆర్టీసీ విజయనగరం రీజియన్ చైర్మన్ దొన్నుదొర, టీడీపీ నాయకులు



డుంబ్రిగుడలో జీసీసీ చైర్మన్ కిడారి శ్రావణ్‌కుమార్‌కి స్వాగతం పలుకుతున్న కూటమి శ్రేణులు

అరకులోయ, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి):అరకులోయ, పాడేరు నియోజకవర్గాల్లో తెలుగుదేశం పార్టీ పటిష్టతతోపాటు గిరిజనాభివృద్ధే లక్ష్యంగా పనిచేస్తామని జీసీసీ చైర్మన్ కిడారి శ్రావణ్‌కుమార్, ఆర్టీసీ విజయనగరం రీజియన్ చైర్మన్ దొన్నుదొర స్పష్టంచేశారు. జీసీసీ చైర్మన్‌గా ఇటీవల బాధ్యతలు స్వీకరించి, ఆదివారం అరకులోయకు వచ్చిన కిడారి శ్రావణ్‌కుమార్‌కు పెద్ద ఎత్తున టీడీపీ నాయకులు, కార్యకర్తలు ఘనస్వాగతం పలికారు. అనంతరం టూరిజం గోష్టిలో జరిగిన కార్యక్రమంలో జీసీసీ చైర్మన్ శ్రావణ్‌కుమార్‌ను ఆర్టీసీ విజయనగరం రీజియన్ చైర్మన్ దొన్నుదొర, టీడీపీ మండల అధ్యక్షుడు శెట్టి బాబూరావు, పెదలబుడు సర్పంచ్ పెట్టెలి దాసుబాబు, మాజీ వైస్ ఎంపీపీ అమ్మన్న అరకు, పాడేరు నియోజకవర్గాల నేతలు ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా శ్రావణ్‌కుమార్ మాట్లాడుతూ అరకు నియోజకవర్గంలో పార్టీ ఎమ్మెల్యే గెలవకపోయినా తమకు పదవులు కట్టబెట్టిన ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకు ధన్యవాదాలు తెలిపారు. రాజకీయాలకు అతీతంగా నియోజకవర్గాలను అభివృద్ధి చేసేందుకు ప్రత్యేక దృష్టి సారిస్తానన్నారు. అటవీ ఉత్పత్తులకు గిట్టుబాటు ధర లభించే విధంగా కృషి చేస్తానన్నారు. ఆర్టీసీ విజయనగరం రీజియన్ చైర్మన్ దొన్నుదొర మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అరకు నియోజకవర్గంపై మమకారాన్ని చూపించి, ఇద్దరు నేతలకు ప్రభుత్వంలో సముచిత స్థానం కల్పించారని, ఇందుకు రుణపడి ఉంటామన్నారు. నాలుగున్నరేళ్ల కాలంలో పార్టీ పటిష్టతపై దృష్టి సారిస్తామన్నారు. అందుకు పార్టీ మండల, పంచాయతీ, గ్రామ నాయకులు సహకరించాలన్నారు. అనంతరం పార్టీ సీనియర్ నాయకులు శెట్టి లక్ష్మణుడు, జీసీసీ డైరెక్టర్ బొర్రా నాగరాజు, అన్ని మండలాల పార్టీ అధ్యక్షులు శ్రావణ్‌కుమార్‌కు అభినందనలు తెలిపారు. అదేవిధంగా పాడేరు డివిజన్ పరిధిలోని జీసీసీ బ్రాంచిమేనేజర్లు, సిబ్బంది అభినందనలు తెలిపారు.

కిడారికి ఘన స్వాగతం

డుంబ్రిగుడ: రాష్ట్ర గిరిజన సహకార సంస్థ చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించి తొలిసారిగా విశాఖ మన్యానికి వచ్చిన కిడారి శ్రావణ్‌కుమార్‌కు మండలంలోని కూటమి శేణులు ఆదివారం ఘన స్వాగతం పలికాయి. డుంబ్రిగుడ, కించుమండ, అరకు ప్రధాన కేంద్రాల్లో గిరిజన మహిళలు, కూటమి నేతలు పూలమాలలు వేసి ఘనంగా స్వాగతం పలికారు. మహిళలు థింసా నృత్యాలతో ఆహ్వానం పలికారు. ఈ సందర్భంగా శ్రావణ్ థింసా నృత్యం చేస్తున్న మహిళలతో కలిసి ఆడారు. ఆయనతో పాటు వచ్చిన ఆర్టీసీ విజయనగరం రీజనల్ చైర్మన్ దొన్నుదొరను పూలమాలలతో స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు తుడుము సుబ్బారావు, టీఎన్టీయూసీ అరకు పార్లమెంట్ ప్రధాన కార్యదర్శి స్వామి, ఎంసీటీసీ సభ్యులు గీత, టీడపీ మండల మాజీ అధ్యక్షుడు కమ్మిడి సుబ్బారావు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

22 మండలాలకు ఒక్కరే!

... 5వ పేజీ తరువాయి

తూనికలు, కొలత శాఖలో ఒక ఇన్‌స్పెక్టర్, టెక్నికల్ అసిస్టెంట్ మాత్రమే వుండడంతో తనిఖీలు నామమాత్రంగానే సాగుతున్నాయి. ఒకవేళ దాడులకు వెళ్లి ఒక దుకాణంలో తనిఖీలు నిర్వహిస్తుంటే.. క్షణాల్లో మిగిలిన వ్యాపారులు దుకాణాలను మూసేసి జారుకుంటున్నారు.

22 మండలాలకు ఒకే ఒక్క ఇన్‌స్పెక్టర్

నర్సీపట్నం తూనికలు, కొలతల శాఖ కార్యాలయం పరిధిలో నర్సీపట్నం, నాతవరం, గొలుగొండ, మాకవరపాలెం, పాయకరావుపేట, కోటవురట్ల, నక్కపల్లి, ఎస్.రాయవరం, ఎలమంచిలి, రాంబిల్లి, అచ్యుతాపురం మండలాలు, అల్లూరి సీతారామరాజు జిల్లాలో పాడేరు, జి.మాడుగుల, చింతపల్లి, జీకే వీధి, కొయ్యూరు, అరకులోయ, అనంతగిరి, డుంబ్రిగుడ, హుకుంపేట, పెదబయలు, ముంచంగిపుట్టు మండలాలు వున్నాయి. నర్సీపట్నం కార్యాలయంలో మూడు పోస్టులు.. ఇన్‌స్పెక్టర్, టెక్నికల్ అసిస్టెంట్, ఆఫీసు సబార్డినేట్ మాత్రమే వున్నాయి. ప్రస్తుతం ఆఫీసు సబార్డినేట్ పోస్టు ఖాళీగా వుంది.

ఎక్కువ పరిధితో ఇబ్బందులు

నర్సీపట్నం కార్యాలయం పరిధిలో అనకాపల్లి జిల్లాలో 4,500, అల్లూరి సీతారామరాజు జిల్లాలో 1,300 దుకాణాలు ఉన్నాయి. నర్సీపట్నం నుంచి సీలేరు, ముంచంగిపుట్టు, అరకులోయ వంటి ప్రాంతాలు చాలా దూరంలో వున్నాయి. ఈ ప్రాంతాల్లో తనిఖీలకు వెళ్లి సాయంత్రానికి తిరిగి నర్సీపట్నం చేరుకునేసరికి ఏ అర్ధరాత్రో అవుతుంది. మహిళా అధికారి కావడంతో దూరప్రాంతాల్లో తనిఖీలకు వెళ్లిరావడం ఇబ్బందికరమే! అయినప్పటికీ గత ఆర్థిక సంవత్సరం (2023-24)లో 173 కేసులు, ఈ ఏడాది ఇప్పటి వరకు 160 కేసులు నమోదు చేశారు.

ముంచగిపుట్టులో పాల ఉత్పత్తులను అధిక ధరలకు విక్రయిస్తున్నారని ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ఫిర్యాదు రావడంతో లీగల్ మెట్రాలజీ ఇన్‌స్పెక్టర్ అనురాధ ఈ ఏడాది ఆగస్టు 26వ తేదీన అక్కడకు వెళ్లి తనిఖీలు నిర్వహించారు. ఐదుగురు వ్యాపారులపై కేసులు నమోదు చేశారు.

విద్యా వ్యవస్థను ప్రయోగశాల చేయొద్దు

... 5వ పేజీ తరువాయి

జరిగింది. ఈ సందర్భంగా చినబ్బాయి మాట్లాడుతూ, సిలబస్‌ను ఇష్టం వచ్చినట్టుగా మారుస్తూ విద్యార్థులను, ఉపాధ్యాయులను ఇబ్బందులకు గురి చేస్తున్నదన్నారు. 117 జీవో వల్ల ప్రభుత్వ పాఠశాలలు నిర్వీర్యమవుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక 117 జీవోను రద్దు చేస్తామని హామీ ఇచ్చి ఇంతవరకు అమలు చేయలేదన్నారు. జీవో నంబరు-3ని సర్వోన్నత న్యాయస్థానం రద్దు చేయడం వల్ల మైదాన ప్రాంత ఉపాధ్యాయులు ఏజెన్సీకి బదిలీపై వెళ్లి ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. ఈ సమావేశంలో రాష్ట్ర కార్యదర్శి అన్నారాము, సమాఖ్య నేతలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పెరిగిన చలితో ఇబ్బందులు



ఉదయం 10 గంటలకు కూడా కురుస్తున్న మంచు

ముంచంగిపుట్టు, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలో గత వారం రోజులుగా చలి పెరిగింది. ఎముకలు కొరికే చలిలో వివిధ పనుల నిమిత్తం బయకు వెళ్లే వారు చలికి ఇబ్బందులు పడుతున్నారు. ఆదివారం ఉదయం 10 గంటలు వరకు మండల కేంద్రంలో మంచు వీడలేదు. సూర్యోదయం అయినప్పటికీ మంచు కారణంగా సూర్యుడు కనిపించడం లేదు. అలాగే సాయంత్రం 3 గంటల నుంచి చలిగాలులు మొదలవుతున్నాయి. చలికి తట్టుకోలేక ప్రజలు ఆపసోపాలు పడుతున్నారు. పిల్లలు, వయసుపై బడిన వారి ఇబ్బందులు వర్ణణాతీతం. గతేడాదితో పోల్చితే ఈ ఏడాది చలి ఎక్కువగా ఉందని స్థానికులు అంటున్నారు. చలి పెరగడం పలు రకాల రోగాలు ప్రజలను పట్టి పీడిస్తున్నాయి. ఆస్పత్రులు రోగులతో కిటకిటలాడుతున్నాయి. మంచు కారణంగా సోకే వ్యాధుల బారిన పడకుండా తగు జాగ్రత్తలు పాటించాలని వైద్యులు సూచిస్తున్నారు.

పది కిలోల గంజాయితో ఇద్దరి అరెస్టు

» ఆటో డ్రైవర్ పరారీ

హుకుంపేట నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): గిరిజన ప్రాంతం నుంచి గంజాయి తరలిస్తున్న ఇద్దరు వ్యక్తులకు అరెస్టు చేసినట్టు ఎస్ఐ సురేష్‌కుమార్ తెలిపారు. ఆదివారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ మండలంలోని కొంతెలి జంక్షన్ వద్ద వాహన తనిఖీలు చేస్తుండగా.. పెద్దబయలు వైపు నుంచి వస్తున్న ఆటో తమను చూసి వెనక్కి వెళ్లిపోతుండగా వెంట పడి పట్టుకొని తనిఖీ చేయగా పది కిలోల గంజాయి పట్టుబడిందన్నారు. ఈ సందర్భంగా తమిళనాడుకు చెందిన మహేష్‌కుమార్, మహమ్మద్ ఖాదర్‌లను అరెస్టు చేశామన్నారు. ఆటో డ్రైవర్ పరారీలో ఉన్నాడని తెలిపారు. కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్టు చెప్పారు.

గిరి మహిళలకు కుట్టుమిషన్ల పంపిణీ



కుట్టుమిషన్ల పంపిణీ కార్యక్రమంలో మాట్లాడుతున్న అతిథులు

అరకులోయ, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): మండలంలోని లోతేరు గ్రామంలో ట్రైబల్ ఫ్యామిలీ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో 20 మంది గిరిజన మహిళలకు కుట్టుమిషన్లను ఆదివారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ గుబ్బాయి కళావతి మాట్లాడుతూ.. గిరి మహిళలను ఆర్థికంగా ఎదిగేందుకు కుట్టుమిషన్లు ఎంతోగానో ఉపయోగపడతాయన్నారు. గిరిజన ప్రాంతంలో సంస్థ తరుపున మరిన్ని సేవా కార్యక్రమాలు చేపట్టాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలోని అధ్యక్షుడు పట్టాసీ కృష్ణారావు, ఉపాధ్యక్షురాలు రాజ్యలక్ష్మి, కార్యదర్శులు యిర్మియా, సుధాకర్, రాకేష్, అప్పలస్వామి, వార్డు మెంబరు సింహాచలం తదితరులు పాల్గొన్నారు.



సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కు అందజేస్తున్న స్పీకర్ అయ్యన్నపాత్రుడు

రూ.8.28 లక్షల సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ

నర్సీపట్నం, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): స్పీకర్ అయ్యన్నపాత్రుడు చేతుల మీదుగా ఆరుగురు లబ్ధిదారులకు రూ.8.28 లక్షల ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను ఆదివారం పంపిణీ చేశారు. శివపురంలోని క్యాంప్ కార్యాలయంలో మునిసిపాలిటీలోని ఒకటో వార్డుకు చెందిన పంచాడ సుధాకర్‌కు రూ.2.5 లక్షలు, పెదబొడ్డేపల్లి పదో వార్డుకు చెందిన శ్రీనుకు రూ.1.35 లక్షలు, బలిఘట్టంకు చెందిన అడ్డాల లోవరాజుకు రూ.1.5 లక్షలు, మాకవరపాలెం మండలం మల్లవరానికి చెందిన తమరాన వంశీకి రూ.1.43 లక్షలు, తూటిపాలకు చెందిన గనిశెట్టి హేమణ్యకు రూ.1.5 లక్షలను చెక్కుల రూపంలో అందజేశారు. ఈ కార్యక్రమంలో పదో వార్డు కౌన్సిలర్ గుడివాడ సాయికృష్ణ, జనసేన ఇన్‌చార్జి సూర్యచంద్ర పాల్గొన్నారు.

మాడుగులలో ఎనిమిది మందికి రూ.9.97 లక్షలు..

మాడుగుల: మాడుగుల నియోజకవర్గంలో ఎనిమిది మంది బాధితులకు వైద్య సేవల కోసం రూ.9.97 లక్షల ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను అందించారు. మాడుగుల పార్టీ కార్యాలయంలో ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి ఆదివారం వీటిని పంపిణీ చేశారు. మాడుగుల గ్రామానికి చెందిన కమల్ కుమార్‌కు రూ.49 వేల చెక్కును అందించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ పట్టణ అధ్యక్షుడు వద్దాది రంజిత్‌వర్మ, క్లస్టర్ ఇన్‌చార్జి పుప్పాల రమేశ్, బీసీ సెల్ జిల్లా కార్యదర్శి ఎం.ఈశ్వరరావు పాల్గొన్నారు.

మోదకొండమ్మను దర్శించుకున్న ఎమ్మెల్యే



అమ్మవారిని దర్శించుకుంటున్న ఎమ్మెల్యే బండారు, తదితరులు

చీడికాడ, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): కార్తీకమాసంలో జరిగే అన్నదానంలో పాల్గొనడం అదృష్టంగా బావించాలని మాడుగుల ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి అన్నారు. తురువోలు గ్రామంలోని శ్రీమోదమాంబ అమ్మవారిని ఆదివారం దర్శించుకున్న అనంతరం గ్రామస్థుల ఆర్థిక సహాయంతో ఏర్పాటుచేసిన అన్నసమారాధనలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ పాత్రిని సింహాచలంనాయుడు, టీడీపీ జిల్లా అధికార ప్రతినిధి రెడ్డి సన్యాసినాయుడు, ఎంపీటీసీ బీళ్ల కోటేశ్వరరావు, పాత్రిని జగన్, ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

మోదకొండమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు

మాడుగుల, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): ఉత్తరాంధ్ర జిల్లాల ఆరాధ్య దైవం మాడుగుల మోదకొండమ్మ ఆలయంలో ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేకువజాము ఆరు గంటల నుంచి అమ్మవారిని అలంకరించి కుంకుమ పూజలు, అభిషేకాలను చేశారు. భక్తులు అధిక సంఖ్యలో ఆలయానికి చేరుకుని అమ్మవారికి ముడుపులు చెల్లించుకున్నారు. అలాగే స్థానికేతర ప్రాంతాలకు చెందిన భక్తులు అధిక సంఖ్యలో అమ్మవారి ఘటాలను నెత్తిన పెట్టుకుని ఊరేగింపుగా ఆలయానికి చేరుకుని ముడుపులు చెల్లించుకున్నారు. భక్తుల సౌకర్యార్థం కమిటీ సభ్యులు అన్ని ఏర్పాట్లను చేశారు. కాగా ఆలయానికి వచ్చిన భక్తులు, అయ్యప్ప, భవానీ మాలధారులకు న్యాయవాది శ్రీనివాస రావు అన్న సంతర్పన కార్యక్రమాన్ని నిర్వహించారు.

ఎ.కొత్తపల్లిలో గౌరీపరమేశ్వరుల ఊరేగింపు



ఎ.కొత్తపల్లిలో గౌరీపరమేశ్వరులను ఊరేగిస్తున్న భక్తులు

దేవరాపల్లి, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎ.కొత్తపల్లిలో శనివారం రాత్రి గౌరీపరమేశ్వరుల ఊరేగింపును ఘనంగా నిర్వహించారు. నాగులచవితి రోజున గౌరీపరమేశ్వరులను గ్రామంలో నెలకొల్పి ప్రతీ రోజు ప్రత్యేకంగా పూజలు నిర్వహించారు. అనంతరం శనివారం రాత్రి బాణసంచా పేలుళ్లు, సాంస్కృతిక కార్యక్రమాల మధ్య ఊరేగింపు నిర్వహించి నిమజ్జనం చేశారు. సర్పంచ్ చింతల వెంకటరమణ, గ్రామస్థులు పాల్గొన్నారు.

టీడీపీ సభ్యత్వంతో బీమా సదుపాయం



చెరకుపల్లిలో టీడీపీ సభ్యత్వం తీసుకుంటున్న గ్రామస్థులు

చీడికాడ, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): టీడీపీ సభ్యత్వం తీసుకున్న కార్యకర్తల కుటుంబాలకు బీమా సదుపాయం వర్తిస్తుందని పార్టీ ఎస్సీ సెల్ జిల్లా ఉపాధ్యక్షుడు చలుగు అప్పలనాయుడు చెప్పారు. చెరకుపల్లి గిరిజన గ్రామంలో ఆదివారం టీడీపీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని నిర్వహించారు. సుమారు 200 మందికిపైగా సభ్యత్వాలను నమోదు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టీడీపీ సభ్యత్వం తీసుకున్న వారికి రూ.5 లక్షల వరకు ప్రమాద బీమా, దహన సంస్కరణ ఖర్చులు అందజేస్తారన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు రంగిసింగి ఈశ్వరరావు, చలుగు సాంబమూర్తి, దిబ్రబోయిన దేముడు పాల్గొన్నారు.

తుఫాన్‌తో వరి కోతలు వాయిదా వేసుకోండి

చీడికాడ, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): తుఫాన్ ప్రభావం పోయేవరకూ వరి కోతలను వాయిదా వేసుకోవాలని మండల వ్యవసాయాధికారి కృష్ణవేణి సూచించారు. ఆదివారం విలేఖరులతో ఆమె మాట్లాడుతూ ఈ నెల 26, 27 తేదీల్లో తుఫాన్ ప్రభావంతో అధిక వర్షాలు పడతాయని వాతావరణ శాఖ అధికారులు తెలిపారన్నారు. ఈ ఏడాది వరి సాగు చేసిన రైతులు 21 శాతం కోతలు కోయగా, ప్రస్తుత తరుణంలో కోసిన పంట తుఫాన్ బారిన పడకుండా తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. పొలంలో నీరు నిల్వ ఉండకూడదని, వరి కోసిన రైతులు కుప్పలు పెట్టుకోవాలని చెప్పారు.

150 మందికి వైద్య సేవలు



వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ వేణు

దేవరాపల్లి, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని రామాలయంలో ఆదివారం ప్రత్యేక వైద్య శిబిరం నిర్వహించారు. సంజీవిని హాస్పటల్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ శిబిరంలో సుమారు 150 మందికి వైద్య పరీక్షలు చేశారు. ఎముకల వైద్య నిపుణులు మళ్ల వేణు వైద్య పరీక్షలు చేసి అవసరమైన మందులను ఉచితంగా పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ కిలపర్తి భాస్కరరావు, నాయకులు మహేశ్వరీ నాయుడు, కొల్లి ఈశ్వరరావు, రామకృష్ణ, ఇట్లా నాయణరావు పాల్గొన్నారు.

శారదానగర్ డ్రైనేజీ సమస్యకు చెక్

పట్టణంలోని శారదానగర్ ప్రధాన డ్రైనేజీ సమస్యకు చెక్ పడనుంది. ఎనిమిదేళ్లుగా అసంపూర్తిగా నిలిచిపోయిన ఈ డ్రైనేజీ పనులను పునఃప్రారంభించడానికి ఆర్‌అండ్‌బీ శాఖ చర్యలు చేపడుతోంది. ఇప్పటికే స్పీకర్ అయ్యన్నపాత్రుడు ఆదేశాల మేరకు రూ.1.05 కోట్లతో అంచనాలు రూపొందించింది.

- అసంపూర్తిగా అండర్ గ్రౌండ్ డ్రైనేజీ నిర్మాణం
- ట్రాన్స్‌ఫార్మర్‌ల అడ్డు నెపంతో నిలిపివేసిన కాంట్రాక్టర్
- ఎనిమిదేళ్లుగా ముందుకు సాగని పనులు
- గత ఐదేళ్లూ సమస్యను గాలికొదిలేసిన వైసీపీ ప్రభుత్వం
- దుర్వాసన, దోమల బెడదతో కాలనీ వాసుల అగచాట్లు
- స్పీకర్ అయ్యన్న ఆదేశాలతో కదిలిన ఆర్‌అండ్‌బీ అధికారులు
- రూ.1.05 కోట్లతో పనుల ప్రారంభానికి అంచనాలు సిద్ధం


నర్సీపట్నం, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): శారదానగర్ డ్రైనేజీ నిర్మాణ పనులు అసంపూర్తిగా ఉండిపోవడంతో కాలనీ వాసులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. వర్షం వస్తే శారదానగర్ మెయిన్ రోడ్డు మోకాళ్ల లోతు నీరు చేరుతుంది. డ్రైనేజీ పనులకు ఆటంకంగా ఉన్న మూడు విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌లు తొలగించలేదన్న కారణం చూపించి కాంట్రాక్టర్ పనులు ఆపేశారు. రెండేళ్ల క్రితం పనులు ఆపేస్తున్నట్టు ఆర్‌అండ్‌బీ అధికారులకు లిఖితపూర్వకంగా తెలిపి వెళ్లిపోయాడు. ఈ సమస్యను గత వైసీపీ ప్రభుత్వం కనీసం పట్టించుకున్న పాపాన పోలేదని ప్రజల నుంచి విమర్శలు వెల్లువెత్తాయి. తాజాగా స్పీకర్ అయ్యన్నపాత్రుడు శారదానగర్ డ్రైనేజీ పనులు మొదలు పెట్టడానికి అంచనాలు రూపొందించాలని ఆర్‌అండ్‌బీ అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. దీంతో ఆర్‌అండ్‌బీ అధికారులు రూ.1.05 కోట్లతో అంచనాలు సిద్ధం చేశారు.

టీడీపీ ప్రభుత్వం హయాంలోని 2018లో అప్పటి ఆర్‌అండ్‌బీ మంత్రి చింతకాయల అయ్యన్నపాత్రుడు బలిఘట్టం బైపాస్ రోడ్డు (శారదాగనర్ రోడ్డు) అభివృద్ధి, డ్రైనేజీ పనులకు రూ.4.5 కోట్లు మంజూరు చేశారు. కాంట్రాక్టర్ ఒప్పందం ప్రకారం దుర్గమల్లేశ్వరస్వామి గుడి నుంచి బైపాస్ రోడ్డు చివరి వరకు 1.84 కిలోమీటర్ల రోడ్డు అభివృద్ధి పనులు, 800 మీటర్ల భూగర్భ డ్రైనేజీ వ్యవస్థ, ఒక కిలోమీటరు పొడవు ఓపెన్ డ్రైనేజీ నిర్మాణం చేపట్టాల్సి ఉంది. కాంట్రాక్టర్ రోడ్డు విస్తరణ పనులు పూర్తిచేసి అడ్డుగా ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌లు తొలగించలేదన్న కారణంతో అసంపూర్తిగా ఆపేశాడు. కాలువ పనులకు ఆటకంగా ఉన్న విద్యుత్ స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్‌లు తొలగించాలని ఆర్‌అండ్‌బీ అధికారులను కాంట్రాక్టర్ కోరాడు. విద్యుత్ స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్‌లను పక్కకు మార్చడానికి ఆర్‌అండ్‌బీ శాఖ అధికారులు ఈపీడీసీఎల్‌కు రూ.30 లక్షలు కూడా చెల్లించారు. నిర్మాణ పనులకు అడ్డుగా ఉన్న స్తంభాలు తొలగించారు.

శారదానగర్ మెయిన్ రోడ్డును ఆనుకొని మూడుచోట్ల విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌లు తొలగించాల్సి ఉంది. ఆర్టీసీ కాంప్లెక్స్ గోడను ఆనుకొని డ్రైనేజీ మీద ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ డిపో లోపలకు మార్చడానికి ఆర్టీసీ యాజమాన్యం అంగీకరించలేదు. పోస్టాఫీసు దాటిన తర్వాత పాత ఇనుమ సామాన్ల కొట్టు దగ్గర ఒకటి, సుబ్రహ్మణ్యస్వామి గుడి ఎదురుగా ఒక ట్రాన్స్‌ఫార్మర్ అడ్డుగా ఉన్నాయి. ట్రాన్స్‌ఫార్మర్‌లు తొలగించకపోవడంతో పనులు చేయలేనని ఆర్‌అండ్‌బీ అధికారులకు కాంట్రాక్టర్ లిఖితపూర్వంగా తెలియజేసి వెళ్లిపోయాడు. బలిఘట్టం బైపాస్ రోడ్డు, శారదానగ్ ప్రధాన డ్రైనేజీ పనులు మొత్తం అంచనా విలువ రూ.4.5 కోట్ల గాను రూ.3.10 కోట్లు పనులు పూర్తి చేశారు. ఇంకా రూ.1.4 కోట్లు పనులు చేయాల్సి ఉంది. ఏడేళ్లుగా పనులు అసంపూర్తిగా నిలిచిపోయాయి. కాలువ కాంక్రీట్ కర్బవాల్స్ శిథిలావస్థకు చేరుకున్నాయి. కర్బ్‌వాల్ ఒరిగోయి మురుగు నీరు పారడం లేదు. దీంతో భరించలేని దుర్వాసన వెదజల్లుతున్నదని, దోమల బెడద ఎక్కువైందని కాలనీ వాసులు గగ్గోలు పెడుతున్నారు. ఈ నేపథ్యంలో స్పీకర్ అయ్యన్నపాత్రుడు ఆదేశాల మేరకు డ్రైనేజీ పనులు ప్రారంభించడానికి ఆర్‌అండ్‌బీ అధికారులు రూ.1.05 కోట్లతో అంచనాలు తయారు చేశారు. త్వరలో డ్రైనేజీ పనులకు మోక్షం కలగనుందని కాలనీ వాసులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



ఎనిమిదేళ్లుగా అసంపూర్తిగానే నిలిచిపోయిన డ్రైనేజీ



కాలువ పనులకు అడ్డుగా ఉన్న ట్రాన్స్‌ఫారం

యూటీఎఫ్ మండల కార్యవర్గం





రామచంద్రరావు, గణేశ్

చోడవరం, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): యూటీఎఫ్ మండల నూతన కార్యవర్గాన్ని ఆదివారం ఎన్నుకున్నారు. మండల అధ్యక్షుడిగా బొడ్డపాటి రామచంద్రరావు, ప్రధాన కార్యదర్శిడా ఎన్.గణేశ్, సహాధ్యక్షులుగా రాజా రమేశ్, వి.చైతన్యశీల, కోశాధికారిగా యూఎస్ బాబ్జి, ఆడిట్ కమిటీ సభ్యులుగా జామి రమేశ్, వేచలపు రామకృష్ణ నియమితులయ్యారు. సంఘం గౌరవాధ్యక్షుడు వేగి సూర్యప్రకాశరావు ఆధ్వర్యంలో నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు.

గ్రామీణ ప్రాంతాలకు బ్యాంకు సేవలు

చోడవరం, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంతాల్లో బ్యాంకు సేవలు విస్తరించనున్నట్టు విశాఖ కోఆపరేటివ్ గ్రామీణ బ్యాంకు చైర్మన్ చలసాని రాఘవేంద్రరావు ప్రకటించారు. చోడవరంలో మాజీ ఎమ్మెల్యే బ్యాంకు పూర్వ చైర్మన్ మానం ఆంజనేయులు చేతుల మీదుగా ఆదివారం సొంత భవనంలో బ్రాంచిని ప్రారంభించారు. ఈ సందర్భంగా బ్యాంకు కార్యక్రమాలు, సేవలను వివరించారు. కార్యక్రమంలో బ్యాంకు ప్రతినిధులు స్టాలిన్, జి.జనార్ధనరావు, సత్యనారాయణ, ఆచార్ల రామకృష్ణారావు, సీఈవో పీవీ నరసింహమూర్తి, గణేశ్‌కుమార్, బ్రాంచ్ మేనేజర్ సిహెచ్.వాసు, ఖాతాదారులు పాల్గొన్నారు.

సంఘ మిత్ర సేవల విస్తరణకు కృషి

కె.కోటపాడు, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంతాల్లో సంఘ మిత్ర సేవల విస్తరణకు కృషి చేస్తున్నామని సంఘమిత్ర రూరల్ డెవలప్‌మెంట్ సొసైటీ చైర్మన్ బసవరాజు అన్నారు. మండల కేంద్రంలో ఆదివారం నిర్వహించిన సొసైటీ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. కె.కోటపాడు మండలంలో ఎనిమిది ప్రాథమిక పాఠశాలలను దత్తత తీసుకుని రూ.12 లక్షలతో సోలార్ ప్లాంట్లు, కంప్యూటర్లు ఏర్పాటు చేసినట్టు చెప్పారు. సొసైటీ అధ్యక్షుడు డాక్టర్ బండారు రామచంద్రరావు మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా విద్య, వైద్య సేవలు, విద్యార్థులకు పుస్తకాలు అందిస్తున్నామని చెప్పారు. అనంతరం ప్రేమ ఆసుపత్రి డైరెక్టర్ డాక్టర్ ఆదినారాయణరావు దంపతులు, డాక్టర్ బండారు మధుసూదన పాత్రుడు దంపతులు, డాక్టర్ లెక్కల గిరినాథ్ దంపతులను సన్మానించారు. కార్యక్రమంలో సొసైటీ కార్యదర్శి బొంతు మంగపతిరావు, డాక్టర్ బండారు అప్పలనాయుడు, బి.గోవిందరావు, సూరెడ్డి బాబురావు, బీవీ రమణమూర్తి, ఎం.మురళీకృష్ణ పాల్గొన్నారు.

ఏఎంఆర్‌పై అవగాహన సదస్సు

నర్సీపట్నం, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): స్థానిక పశు వైద్యశాలలో ఆదివారం యాంటీ మైక్రోబియల్ రెసిస్టెన్స్ (ఏఎంఆర్)పై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఏడీడబ్ల్యూ రాంబాబు మాట్లాడుతూ మందులు తక్కువ మోతాదులో వాడాలని, అవసరం లేకుండా అధిక మోతాదులో మందులు వాడకూడదని చెప్పారు. అతిగా యాంటీ బయోటిక్స్ వాడితే పశువులలో యాంటీ మైక్రోబియల్ రెసిస్టెన్స్ పెరుగుతుందన్నారు. దీనివల్ల అత్యవసర సమయంలో ఔషధాలు పనిచేయకుండా పోతాయని ఆయన తెలిపారు. పాలు, మాంసం, గడ్లు ద్వారా మనుషులపై దుష్ప్రభావాలు చూపుతాయని చెప్పారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

చీడికాడ, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అప్పలరాజుపురం ఉన్నత పాఠశాలలో 1994-95 బ్యాచ్ పదో విద్యార్థులు ఆదివారం ఆత్మీయంగా కలుసుకున్నారు. ఒకరినొకరు పలకరించుకొని నాటి జ్ఞాపకాలను నెమర వేసుకున్నారు. వారిలోని పేద విద్యార్థుల కుటుంబాలను ఆదుకోవాలని తీర్మానించారు. ఇదే స్కూల్‌లో 1984-85 బ్యాచ్ టెన్త్ విద్యార్థులు కూడా కలుసుకున్నారు. ఈ బ్యాచ్‌లో మాజీ ఎమ్మెల్యే గవిరెడ్డి రామానాయుడు, పలువురు ప్రముఖులు ఉన్నారు.

టీడీపీలోనే బీసీలకు గుర్తింపు

- గవరల సంక్షేమానికి కట్టుబడి పనిచేస్తాం
- రాష్ట్ర గవర కార్పొరేషన్ చైర్మన్ మళ్ల సురేంద్ర
- గవర కార్పొరేషన్ చైర్మన్, డైరెక్టర్లకు ఘన సత్కారం



రాష్ట్ర గవర కార్పొరేషన్ చైర్మన్, డైరెక్టర్లను సత్కరిస్తున్న దృశ్యం

చోడవరం, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): బీసీలకు గుర్తింపు ఇచ్చింది తెలుగుదేశం పార్టీయేనని రాష్ట్ర గవర కార్పొరేషన్ చైర్మన్ మళ్ల సురేంద్ర తెలిపారు. ఆదివారం గవర కార్పొరేషన్ డైరెక్టర్ బొడ్డేడ నాగగంగాధర్ ఆధ్వర్యంలో రాయపురాజుపేటలో గవర కార్పొరేషన్ చైర్మన్‌తో పాటు డైరెక్టర్లకు అభినందన సభ నిర్వహించారు. ఈ సందర్భంగా సురేంద్ర మాట్లాడుతూ రాష్ట్రంలో గవరల సంక్షేమానికి కట్టుబడి ఉంటామన్నారు. చంద్రబాబు తమపై పెట్టిన గురుతర బాధ్యతకు సంపూర్ణ న్యాయం చేస్తామని, ప్రభుత్వపరంగా కార్పొరేషన్ ద్వారా గవరల సంక్షేమానికి చిత్తశుద్ధితో పాటుపడతామని చెప్పారు. జిల్లా టీడీపీ అధ్యక్షుడు, రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ బత్తుల తాతయ్యబాబు మాట్లాడుతూ నామినేటెడ్ పదవుల నియామకంలో పార్టీలో కష్టకాలంలో పనిచేసిన వారికి చంద్రబాబు ప్రాధాన్యత ఇచ్చారన్నారు. చోడవరం నియోజకవర్గానికి సంబంధించి యువకుడైన గంగాధర్‌కు నామినేటెడ్ పదవిని ఇవ్వడం ద్వారా యువతకు తగిన గుర్తింపు ఇచ్చినట్టయిందన్నారు. ఎమ్మెల్యే కేఎస్ఎన్ఎస్ రాజు మాట్లాడుతూ గవరలకు సముచిత ప్రాధాన్యం ఉంటుందని, వారికి అన్నివేళలా అండగా ఉంటానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో జడ్పీటీసీ మాజీ సభ్యుడు కనిశెట్టి మత్స్యరాజు, మాజీ ఎంపీపీ పెదబాబు, టీడీపీ నాయకుడు మల్లునాయుడు, పూతి కోటేశ్వరరావు, జనసేన నాయకుడు సిరిపురపు రమేశ్, రాయపురాజుపేట సర్పంచ్ బొడ్డేడ రామునాయుడు, నియోజకవర్గానికి చెందిన ముఖ్య నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

బ్రాహ్మణులకు తక్కువ వడ్డీకి రుణాలు: సీఈవో నాగసాయి



మాట్లాడుతున్న సీఈవో నాగసాయి

చోడవరం, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): ఏపీ బ్రాహ్మణ కార్పొరేషన్ ద్వారా ప్రభుత్వం అర్చకులకు, పురోహిత బ్రాహ్మణులందరికీ తక్కువ వడ్డీకి రుణ సౌకర్యం కల్పిస్తున్నదని బ్రాహ్మణ కార్పొరేషన్ సీఈవో జి.నాగసాయి తెలిపారు. చీడికాడ రోడ్డులో గణేశ గాయత్రీ బ్రాహ్మణ సేవాసంఘం ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన బ్రాహ్మణుల సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. బ్రాహ్మణ సంక్షేమానికి ప్రభుత్వం అన్ని విధాలుగా కృషి చేస్తున్నదన్నారు. బ్రాహ్మణ కార్పొరేషన్ పథకాలు అమలయ్యేలా చూస్తామన్నారు. కార్పొరేషన్ అందించే రుణ సదుపాయాన్ని వినియోగించుకోవాలని సూచించారు. అనంతరం కార్తీక పురాణ కాలక్షేపం, ఆధ్యాత్మిక ప్రసంగాలు ఇతర సాంస్కృతిక కార్యక్రమాలు, ఆటల పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా సంఘం కార్పస్ ఫండ్‌కు కందర్ప రవికుమార్ రూ.లక్ష విరాళాన్ని అందచేశారు. ఈ కార్యక్రమంలో సంఘం గౌరవాధ్యక్షుడు కందర్ప కృష్ణమూర్తి, న్యాయవాది కందర్ప రమేశ్, సంఘం అధ్యక్షుడు పుల్లేవు శ్యాం, నాయకులు వి.శంకర్, శ్రీనివాస్, జి.సత్యనారాయణ, జి.సీతారామయ్య పాల్గొన్నారు.

అదానీ పవర్ ప్రాజెక్టు ఒప్పందాలు రద్దు చేయండి

- సీపీఎం జిల్లా నాయకుల డిమాండ్

చోడవరం, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): ఆర్థిక నేరస్థుడు అదానీతో గత ప్రభుత్వం కుదుర్చుకున్న హైడ్రో పవర్ ప్రాజెక్టు ఒప్పందాలను రద్దు చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు డి.వెంకన్న, జిల్లా కమిటీ సభ్యుడు వీవీ శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. చోడవరంలో ఆదివారం నిర్వహించిన సీపీఎం సర్వసభ్య సమావేశంలో వారు మాట్లా డారు. ఏజెన్సీ ప్రాంతాల్లో అదానీ కంపెనీ తలపెట్టిన హైడ్రో పవర్ ప్రాజెక్టులను కూటమి ప్రభుత్వం తక్షణం నిలిపివేయడంతో పాటు ఒప్పందాలను సమీక్షించాలని కోరారు. నాటి వైసీపీ ప్రభుత్వం అడ్డగోలుగా అదానీతో ఒప్పందాలు కుదుర్చుకోవడంతో పాటు ఏజెన్సీ ప్రాంతాల్లో నెలకొల్పేందుకు అనుమతులు ఇచ్చారని విమర్శించారు. వీటి కోసం వేలాది ఎకరాల అటవీ భూములు అదానీ కంపెనీకి జగన్ ప్రభుత్వం అడ్డగోలుగా కేటాయించిందన్నారు. అలాగే అదానీతో పాటు అతని నుంచి ముడుపులు తీసుకున్న నాయకులపై కూటమి ప్రభుత్వం కేసులు నమోదు చేసి అరెస్టు చేయాలని కోరారు. గోవాడ షుగర్ ఫ్యాక్టరీని ఆదుకోవడంతో పాటు గిరిజన ప్రాంతాలకు రహదారులు నిర్మించి ఆర్టీసీ సేవలు మెరుగుపరచాలని విన్నవించారు. ఈ సమావేశంలో సీపీఎం నాయకులు ఎస్‌వీ.నాయుడు, సాంబశివరావు, అప్పారావు, దేముళ్లు పాల్గొన్నారు.

ఘనంగా విజయ్ జన్మదిన వేడుకలు





బాలసదనంలో విద్యార్థికి దుప్పటి అందిస్తున్న పద్మావతి... మాకవరపాలెంలో రోగులకు పండ్ల పంపిణీ

నర్సీపట్నం, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): బాలసదనం వసతి గృహంలోని విద్యార్థినుల మధ్య ఆదివారం టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చింతకాయల విజయ్ జన్మదిన వేడుకలు నిర్వహించారు. 26వ వార్డు కౌన్సిలర్ చింతకాయల పద్మావతి పిల్లలతో కేక్ కట్ చేయించి స్వీట్లు, పండ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పెదిరెడ్ల లక్ష్మణ్ కుమార్, గచ్చపువీధి సతీశ్ ఆధ్వర్యంలో విద్యార్థినులకు అవసరమైన దుప్పట్లు, సబ్బులు, పెన్నులు, తల నూనెలను పంపిణీ చేశారు. అనంతరం పద్మావతి మాట్లాడుతూ వసతి గృహానికి అవసరమైన కొత్త ఆర్వో ప్లాంట్ ఏర్పాటు చేయడానికి తమవంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

మాకవరపాలెంలో...

మాకవరపాలెం: టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చింతకాయల విజయ్ జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. పార్టీ నాయకులు కేక్ కట్ చేశారు. అనంతరం ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు పండ్లు, రొట్టెలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భవిష్యత్తులో విజయ్ మంచి పదవులు పొందాలని కోరారు. కార్యక్రమంలో సర్పంచులు అల్లు రామునాయుడు, రుత్తల నందకిశోర్, టీడీపీ నాయకులు చిరంజీవి, శంకర్‌గిరి, రుత్తల జోగిపాత్రుడు, కె.బాబూరావు, కోసూరు శ్రీను పాల్గొన్నారు.